

చోడవరంలో కురుస్తున్న వర్షం

అకాల వర్షం

పలుచోట్ల వడగండ్ల వాన

- ఈదురు గాలులతో లేచిపోయిన ఇళ్ల పైకప్పులు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. చోడవరంలో వడగండ్లు పడ్డాయి. కొన్నిచోట్ల ఈదురు గాలులు వీచడంతో పూరిళ్లు, రేకుల షెడ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో పక్షం రోజుల నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు ఉపశమనం చెందారు.



మునగపాక మండలం మూలపేటలో ఈదురు గాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు

అనకాపల్లి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 20 నిమిషాలపాటు ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. 12.5 ఎం.ఎం.ల వర్షపాతనం నమోదైనట్టు ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షం కారణంగా పట్టణంలోని డ్రైనేజీ కాలువలు పొంగి మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. చోడవరంలో సుమారు అరగంటపాటు వడగండ్లతో భారీ వర్షం కురిసింది. అనకాపల్లి మండలంలో రేబాక పంచాయతీ శివారు కాపుశెట్టివానిపాలెంలో ఈదురుగాలుల కారణంగా కరణం రమణకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. వర్షం పడడంతో ఇంటిలోని సామాన్లన్నీ తడిసిపోయాయి. మునగపాక మండలంలో ఈదురు గాలులు వీచడంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. మూలపేటలో కొబ్బరి చెట్టు విరిగి, విద్యుత్ లైన్‌పై పడడంతో నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. చీడికాడ, గొలుగొండ, సబ్బవరం, బుచ్చెయ్యపేట, కశింకోట మండలాల్లో జల్లులు పడ్డాయి. నర్సీపట్నం, రావికమతం, కోటవురట్ల, అచ్యుతాపురం, ఎలమంచిలి, కె.కోటపాడు, పాయకరావుపేట, రాంబిల్లి, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల్లో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా వుంది.

శరవేగంగా ఈకేవైసీ

- రేషన్ కార్డుదారులకు బయోమెట్రిక్ ఆథంటికేషన్
- జిల్లాలో 14,99,160 మందికి బియ్యం కార్డులు
- ఇంతవరకు 13,50,850 మందికి ఈకేవైసీ పూర్తి
- నెలాఖరు వరకే గడువు



రోలుగుంట మండలం బుచ్చెంపేటలో ఈ-కేవైసీ చేయిస్తున్న సచివాలయ సిబ్బంది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రేషన్ కార్డుదారుల బయోమెట్రిక్ ఆథంటికేషన్ (ఈకేవైసీ) ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. ఇంతవరకు 98 శాతం మంది కార్డుదారులు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఈకేవైసీకి ఈ నెల 31తో గడువు ముగియనుండడంతో మిగిలిన వారు కూడా వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి. చనిపోయిన వారి పేర్లు, అనర్హుల తొలగింపునకు ప్రభుత్వం రేషన్ కార్డులను అప్‌డేట్ చేయిస్తుంటుంది. ఇందులో భాగంగా గత నెల ఒకటో తేదీ నుంచి ఈకేవైసీ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. రేషన్ కార్డులో పేరున్న వ్యక్తుల్లో ఒకరు తమ పరిధిలోని రేషన్ డిపోకు వెళ్లి, డీలర్ వద్ద వుండే ఈపోస్ యంత్రం సాయంతో ఈకేవైసీ చేయించుకోవాలి. అదే విధంగా ఆధార్ కార్డు నంబర్‌ను రేషన్ కార్డుతో అనుసంధానం చేయాలి. ఇదిలావుండగా పదేళ్ల క్రితం టీడీపీ హయాంలో పల్స్ సర్వే చేయగా, గత వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఈకేవైసీ చేయించింది. ఈ సందర్భంగా పలువురు అనర్హులకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బోగస్ రేషన్ కార్డులపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఇటువంటి వాటిని తొలగించి, అర్హులకు కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయడానికి ఈకేవైసీ చేయాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించింది.

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 5.37 లక్షల కుటుంబాలకు బియ్యం కార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించి మొత్తం 14,99,160 మంది లబ్ధిదారులు ఉన్నారు. సోమవారం సాయంత్రానికి 13,50,850 మంది (90.1 శాతం) ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,48,310 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మిగిలిన వారు ఈ నెల 31వ తేదీలోగా సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మూర్తి తెలిపారు.

ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య విజయం

అదరగొట్టిన అశుతోష్

- రాణించిన డుప్లెసిస్, స్టబ్స్, విప్‌రాజ్ నిగమ్..
- లఖ్‌నవూ బ్యాటింగ్‌లో మిశ్చల్ మార్ష్, పూరన్ మెరుపులు

సిక్సర్లతో హోరెత్తిన స్టేడియం

- రిషబ్ పంత్ పేలవమైన బ్యాటింగ్‌తో నిరాశ చెందిన ప్రేక్షకులు



విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య విజయం సాధించింది. చివరి ఐదు ఓవర్లలో మ్యాచ్‌ను ఊహించని మలుపుతిప్పి జట్టుకు అద్భుతమైన విజయాన్నందించిన అశుతోష్ శర్మను ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందించారు. చివరి ఓవర్‌లో ఆరు పరుగులు చేయాల్సి ఉండగా...మూడో బంతిని అశుతోష్ శర్మ సిక్సర్‌గా మలచాడు.

ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సోమవారం రాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మెన్‌లో మార్ష్ మొదటి ఓవర్ చివరి బంతిని సిక్సర్‌గా మలిచి ఖాతా తెరిచాడు. స్టార్క్ వేసిన రెండో ఓవర్‌లో మక్రమ్, మార్ష్ చెరో సిక్సర్ బాది స్టేడియాన్ని హోరెత్తించారు. ఐదో ఓవర్‌లో నిగమ్ వేసిన బంతిని మార్క్రమ్ లాంగ్ ఆఫ్ మీదుగా సిక్సర్ కొట్టేందుకు యత్నించి అవుటయ్యాడు. అదే ఓవర్‌లో ఎల్ఎస్‌జీ 50 పరుగులు పూర్తిచేసింది. ఓపెనర్ మార్ష్ 21 బంతుల్లో ఐదు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. ఆ తరువాత ఓవర్‌లో మార్ష్ డీప్ వికెట్ మీదుగా సిక్సర్ కొట్టగా, మరో ఎండ్‌లోని పూరన్ వరుసగా మూడు సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరిగెత్తించాడు. మిచెల్ మార్ష్ కేవలం 36 బంతుల్లో ఆరు బౌండరీలు, ఆరు సిక్సర్లతో 72 పరుగులు చేసి ముకేష్‌కుమార్ బౌలింగ్‌లో స్టబ్స్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా పెవెలియన్‌కు చేరాడు. మ్యాచ్ 13వ ఓవర్‌లో ఢిల్లీ బౌలర్ స్టబ్స్‌ను పూరన్ ఊచకోత కోశాడు. మిడాన్, మిడాఫ్, లాంగ్ ఆన్ మీదుగా వరుసగా నాలుగు సిక్సర్లతోపాటు మరో బౌండరీ బాది 30 పరుగులు రాబట్టాడు. ఆ తరువాత క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రిషబ్‌పంత్ ఆరు బంతులు ఆడి పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. పూరన్ కేవలం 30 బంతుల్లో ఆరు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 75 పరుగులు చేసి స్టార్క్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ మోహిత్ బౌలింగ్‌లో చివరి రెండు బంతులను మిల్లర్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టడంతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. 210 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా వికెట్లు కోల్పోవడంతో గ్యాలరీలలోని ప్రేక్షకులలో ఉత్సాహం తగ్గింది. డుప్లెసిస్ (29), కెప్టెన్ అక్షర పటేల్ (22), స్టబ్స్ (34) కొద్దిసేపు మెరిశారు. స్టబ్స్ అవుట్‌తో మ్యాచ్ ఢిల్లీ చేజారిందని అందరూ భావించారు. ఆ సమయంలో అశుతోష్‌శర్మ అజేయ అర్ధ సెంచరీ (66 నాటౌట్), విప్‌రాజ్ నిగమ్ (39) మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు.

ఘనంగా మంత్రి అనిత జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన కూటమి నాయకులు, ఎస్పీ, ఇతర అధికారులు

నక్కపల్లి/ఎస్.రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను సోమవారం పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూటమి పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి సమీపంలోని అనిత నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు వచ్చి మంత్రి అనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సింహాచలం, అన్నవరం, ఉపమాక ఆలయాల నుంచి వేదపండితులు వచ్చి ఆశీర్వచనం చేశారు. కాగా ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్ర తీరంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు నాలుగు మండలాల టీడీపీ శ్రేణులు, కుటుంబ సభ్యుల సమక్షంలో మంత్రి అనిత కేక్ కట్ చేశారు. రేవుపోలవరం గ్రామానికి చెందిన వాసపల్లి అడవిరాజు ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని మంత్రి తిలకించి ఫొటోలు దిగారు.



గజమాలతో హోం మంత్రి అనితను సత్కరిస్తున్న నియోజకవర్గం టీడీపీ నాయకులు

అల్లూరిపై సినిమా



- దర్శకుడు కృష్ణవంశీ
- రచయిత యండమూరితో కలిసి అల్లూరి స్మారక ప్రదేశాల సందర్శన

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో అల్లూరి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దర్శకుడు కృష్ణవంశీ, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, తదితరులు

- వార్త 8వ పేజీలో

ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ టోకరా

- గోవాడ షుగర్స్ నుంచి అర్ధంతరంగా లారీలు తరలింపు
- కాటాల వద్ద కూలీలకు, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.30 లక్షల మేర ఎగనామం
- ఫ్యాక్టరీ ఎండీని కలిసిన బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు



ఫ్యాక్టరీ ఎండీని కలిసిన కూలీలు

చోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని తూనిక కేంద్రాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు రవాణా ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ టోకరా ఇచ్చాడు. కిరాయి బకాయిలు చెల్లించాలంటూ లారీల నుంచి చెరకు అన్‌లోడ్ చేయకుండా, కాటాల నుంచి చెరకు రవాణా చేయకుండా ఐదురోజులపాటు ఇబ్బందులకు గురిచేసిన ఇతను, తీరా బకాయిలు అందుకున్న తరువాత చెప్పాపెట్టకుండా లారీలను తీసుకుని వెళ్లిపోయాడు. మరోవైపు కాటాల వద్ద లారీలకు చెరకు లోడింగ్ చేసే కూలీలకు, ట్రాక్టర్లతో చెరకు తెప్పించిన

... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.13 (మంగళవారం సాయంత్రం)

సహార్ : 4.42 (బుధవారం ఉదయం)

మురుగు నుంచి విముక్తి

ఎలమంచిలి వాసులకు తీరనున్న యానాద్రి కాలువ కష్టాలు

- ఆధునికీకరణకు రూ.2.73 కోట్లు మంజూరు చేసిన వీఎంఆర్‌డీఏ
- పూడికతీత పనులు ప్రారంభం
- అనంతరం రిటైనింగ్ వాల్స్ సీసీ లైనింగ్
- పట్టణ ప్రజలకు తొలగనున్న దుర్వాసన, దోమలబెడద



ఎలమంచిలి కొత్తపేటలో యానాద్రి కాలువలో పూడికతీత పనులు

ఎలమంచిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

దశాబ్దాలుగా ఇబ్బంది పెడుతున్న యానాద్రి కాలువ సమస్య నుంచి ఎలమంచిలి పట్టణ వాసులకు విముక్తి కలగనున్నది. కాలువ ఆధునికీకరణకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) రూ.2.73 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే కాలువలో పూడిక తీత పనులు మొదలయ్యాయి. రిటైనింగ్ వాల్, సీసీ లైనింగ్‌తో చేపట్టిన కాలువ నిర్మాణ పనులు పూర్తయితే పట్టణంలోని పలు వార్డుల ప్రజలకు మురుగు, ముంపు సమస్యలు తొలగుతాయి.

ఎలమంచిలికి ఎగువన్న ఉన్న శేషుగెడ్డ ఆనకట్ట నుంచి యానాద్రి కాలువ ద్వారా మండలంలోని పలు గ్రామాల పొలాలకు గతంలో సాగు నీరు అందేది. కొంతకాలం తరువాత ఎలమంచిలి పంచాయతీతోపాటు చుట్టుపక్కల వున్న మరికొన్ని పంచాయతీలను కలిపి ఎలమంచిలి మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. శేషుగెడ్డ ఆయకట్టు పొలాలు నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. పంట కాలువ కాస్తా డ్రైనేజీ కాలువగా మారిపోయింది. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువలో పూడికతీత, ఇతర నిర్వహణ పనులు చేయించడం మానేశారు. యానాద్రి కాలువ తమది కాదంటూ మునిసిపాలిటీ అధికారులు కూడా పూర్తిస్థాయిలో పూడికలు తీయించడంలేదు. దీంతో మురుగునీరు సరిగా ప్రవహించ ఎక్కడికక్కడ నిలిచిపోతున్నది. చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవు వున్న యానాద్రి కాలువ వర్షాకాలంలో పొంగి, మురుగునీరు రహదారులపై ప్రవహిస్తున్నది. కాలువను ఆధునీకరించడానికి మునిసిపాలిటీ వద్ద నిధులు లేకపోవడంతో ప్రభుత్వానికి విన్నవించాల్సి వచ్చింది. సుమారు 20 ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు యానాద్రి కాలువను ఆధునీకరిస్తామని చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రజలకు సమస్యలు మరింత పెరిగాయి. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి

... మిగతా 8వ పేజీలో



మిలిటరీ కాలనీ వద్ద పూడిక తీసిన తరువాత కాలువ పరిస్థితి

ఈ నెలాఖరుతో ఖరీఫ్ ధాన్యం సేకరణ పూర్తి: జేసీ

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి చేపట్టిన ధాన్యం సేకరణ ఈ నెలాఖరుతో ముగుస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,893 మంది రైతుల నుంచి 25,372.88 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రయారం ఆయా రైతులకు రూ.58.147 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. ఖరీఫ్‌లో పండిన ధాన్యం సేకరణను ఈ నెల 31వ తేదీతో ముగించాలని ప్రభుత్వం ఆదేశించిందని, అందువల్ల ఇంకా ధాన్యం విక్రయించుకోని రైతులు ఎవరైనా వుంటే వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని జేసీ చెప్పారు.

ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు

మునగపాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలుల కారణంగా పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. మండలంలో మూలపేటలో రైతుల కల్లాలకు వెళ్లే మార్గంలో గాలులకు విద్యుత్ వైర్లపై కొబ్బరి చెట్టు పడడంతో నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో చెట్లు కూడా పడిపోయాయి. రైతులు ఈపీడీసీఎల్ అధికారులకు సమాచారాన్ని అందించారు.

నేడు ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

టెన్త్ గణితం పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజరు

ఎస్. రాయవరం, మార్చి24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సోమవారం జరిగిన గణితం పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో స్వప్న ప్రియారెడ్డి తెలిపారు. ఎస్.రాయవరం పరీక్షా కేంద్రంలో నలుగురు విద్యార్థులు, దార్లపూడి పరీక్షా కేంద్రంలో ఇద్దరు, కొరుప్రోలులో ఇద్దరు, అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఒక విద్యార్థి గైర్హాజయ్యారని ఆమె చెప్పారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఏవో రాముకు ప్రథమ స్థానం


ప్రథమ స్థానం సాధించిన రాము

అచ్యుతాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న రాము పవర్ లిఫ్టింగ్‌లో ప్రథమ స్థానం సాధించారు. విశాఖలోని విజయాంధ్ర వ్యాయామ మండలి ఆధ్వర్యంలో 61వ విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలు ఈనెల 23న నిర్వహించారు. ఈపోటీల్లో రాము 120 కేజీ ప్లస్ పురుషుల విభాగంలో పాల్గొని 97.50 కేజీల బరువు ఎత్తి గోల్డ్‌మెడల్ సాధించారు. ప్రథమ స్థానం సాధించిన రామును ఎంపీడీఓ ప్రభాకరరావు, సిబ్బంది అభినందించారు.

గోవిందపాలెంలో ఇఫ్తార్ విందు

రాంబిల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంజాన్ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి మండలంలోని గోవిందపాలెంలో ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎస్‌కే ఇస్మాయిల్,ఎస్‌కే అన్సార్ వలి, హుస్సేన్ మాట్లాడుతూ రాంబిల్లిలో మసీద్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇఫ్తార్ విందుకు కూటమి, వైసీపీ నేతలు వి.దిన్‌బాబు, జి.శ్రీనుబాబు, రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర, పలు గ్రామాల సర్పంచులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేవీ ఉద్యోగులు, 200 మంది ముస్లింలు, కార్మికులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు సీసీ రోడ్డు వేయండి

రాంబిల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు సీసీ రోడ్డు వేయాలని, పంట కాలువపై వంతెన నిర్మించాలని సామాజిక ఉద్యమ కార్యకర్త జల్లూరి చినరామకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో పంట కాలువ ఉందని, దానిపై నుంచి మృతదేహాలు తీసుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని, కాలువపై వంతెన నిర్మించాలని కోరారు.

పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అంగన్‌వాడీలకు శిక్షణ

పాయకరావుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పఢాయి బీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, డీఆర్‌పీ సీహెచ్.ప్రసాద్ మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాధాన్యం, నవచేతన మోడల్, గృహ సందర్శనలు, ప్రీ స్కూల్ విద్య, గ్రోత్ మోనటిరింగ్, అభివృద్ధి, డొమైన్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నేడు సర్వసిద్ధి పీహెచ్‌సీలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఎస్. రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాసంతి తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని వాసంతి సూచించారు.

ఉపమాక ఆలయ అభివృద్ధికి టీటీడీ గ్రీన్‌సిగ్నల్

- పదేళ్లలో తొలిసారి బోర్డు మీటింగ్‌లో తీర్మానం
- హోం మంత్రి అనిత చొరవతో స్పందించిన చైర్మన్


టీటీడీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న హోం మంత్రి అనిత, టీడీపీ నేతలు (ఫైల్)

నక్కపల్లి,మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రం ఇక అభివృద్ధి వైపు పరుగులు తీయనుంది. ఈ ఆలయాన్ని టీటీడీ స్వాధీనపర్చుకున్న పదేళ్లకు ఎట్టకేలకు పాలకమండలి సమావేశంలో ఉపమాక ఆలయం అభివృద్ధికి తొలిసారి తీర్మానం చేశారు. సోమవారం టీటీడీ బోర్డు సమావేశంలో అనుబంధ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్టు టీటీడీ చైర్మన్ బీవీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ అనుబంధ ఆలయాల్లో ఉపమాక ఆలయం పేరును కూడా ఆయన ప్రస్తావించారు.

గత కొన్నేళ్ల నుంచి ఉపమాక అభివృద్ధిని టీటీడీ గాలి కొదిలేసింది. హోం మంత్రి అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఎట్టకేలకు టీటీడీ పాలకమండలి సానుకూలంగా స్పందించింది. గత నెల 17న టీటీడీ చైర్మన్‌ను హోం మంత్రి కలిసి, ఉపమాక ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై వినతిపత్రం అందజేశారు. టీటీడీ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేశారని వెంకన్న భక్తులు ఆనందం వెలిబుచ్చుతున్నారు.

ఘనంగా హోం మంత్రి అనిత జన్మదిన వేడుకలు


మంత్రి అనితకు అన్నవరం సత్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న వేదపండితులు


మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీస్ అధికారులు

నక్కపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు నక్కపల్లికి సమీపంలోని ఆమె నివాస గృహం వద్ద సోమవారం ఘనంగా జరిగాయి. జిల్లా అధికారులు, కూటమి నాయకులు ఆమె నివాసానికి వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సింహాచలం, అన్నవరం, ఉపమాక దేవస్థానాల నుంచి వేదపండితులు, అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం చేసి, దేవతామూర్తుల చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పెద్దలు హోంమంత్రికి ఆశీస్సులు అందజేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు కుమారస్వామి, అప్పన్న, రామకృష్ణ, తదితరులు హోం మంత్రి అనితను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, హోం మంత్రిని కలిసి అనకాపల్లి నూకాంబికా అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, శుభాకాంక్షలు చెప్పారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అనేక మంది పార్టీ నాయకులు రక్తదానం చేశారు. ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన రాజయ్యపేట నూకతాత క్రికెట్ జట్టుకు రూ.1 లక్ష చెక్‌ను హోం మంత్రి అనిత అందజేశారు. రన్నర్‌గా నిలిచిన పాయకరావుపేట జట్టు సహా పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రికెట్ క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నేతలు గెడ్డం బుజ్జి, శివదత్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొండబాబు, కురందాసు నూకరాజు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, చిట్టిబాబు, లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి బుజ్జి, గుర్రం రామకృష్ణ, దార్ల కృష్ణ, దేవర సత్యనారాయణ, వైబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని టీడీపీ నాయకులు పలు గ్రామాల్లో సేవ కార్యక్రమాలు నిర్వహించారు. గుడివాడలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, సీనియర్ నాయకుడు గుర్రం రామకృష్ణ కేక్ కట్ చేసి అందరికి పంచారు. అనంతరం గ్రామంలోని దివ్యాంగులకు, పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. వమ్మవరంలో టీడీపీ నేత పల్లెల జగ్గారావు (బుజ్జి) ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు, డ్రింక్స్ పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులంతా హోం మంత్రి అనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


రేవుపోలవరం తీరంలో టీడీపీ నేతల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి అనిత


పాయకరావుపేటలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


అనితకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు


పాములవాకలో కేక్ కట్ చేస్తున్న జనార్దన్

పాయకరావుపేటలో..

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బర్త్ డే సందర్భంగా సోమవారం టీడీపీ నాయకులు పట్టణంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పీఆర్ గెస్టుహౌస్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, దేవవరపు రాజబాబు, చింతకాయల రాంబాబు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియంకేరి, మలిపెద్ది వెంకటరమణ, వేములపూడి అప్పారావు, పెదిరెడ్డి నాగవెంకటరమణ, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మంగవరంరోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీను తదితరులు హోం మంత్రి వి.అనిత బర్త్ డే కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీచేశారు. అనంతరం తాపీ పనివారలకు టవల్స్ పంపిణీచేశారు. ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిగట్ల శ్రీను, గొల్లపల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని పాములవాకలో సోమవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు వేచలపు జనార్దన్, భాస్కరరావు ఆధ్వర్యంలో మంత్రి అనిత జన్మదిన వేడుకలు నిర్వహించారు. జనార్దన్ కేక్ కట్ చేసి అందరికి పంపిణీచేశారు. అలాగే గొట్టివాడ గ్రామంలో టీడీపీ నాయకులు సుంకర్ బాబ్జి ఆధ్వర్యంలో మంత్రి అనిత పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అనితకు శుభాకాంక్షలు తెలిపిన ప్రగడ

ఎలమంచిలి: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను సోమవారం నక్కపల్లిలోని ఆమె స్వగృహంలో రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనితను ఘనంగా సత్కరించారు.

ఆశాజనకంగా రోజువారీ ఆశీలు వేలం

- గతేడాది కంటే రూ.2.68 లక్షలు పెరిగిన ఆదాయం
- వాయిదా పడిన మిగిలిన మూడు వేలం పాటలు

పాయకరావుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట మేజరు పంచాయతీలో సోమవారం నిర్వహించిన రోజువారీ ఆశీల వసూలు వేలం పాట నాలుగేళ్ల తరువాత ఆశాజనకంగా పెరిగింది. గతేడాది రూ.6.65 లక్షలకు వెళ్లిన వేలం పాట ఈ ఏడాది రూ.2.68 లక్షలు పెరిగి రూ.9.33 లక్షలకు వెళ్లింది. పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఎల్.శివరామమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రోజువారీ మార్కెట్ ఆశీలు, మేకల కబేలా, చేపల మార్కెట్, చెట్ల ఫలసాయాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో 15 మంది పాల్గొన్నారు. మేకల కబేలా ఆశీలు, రిటైల్ చేపల మార్కెట్, చెట్ల ఫలసాయం వేలం పాటలు అప్‌సెట్ ప్రైస్ కంటే తక్కువకు వెళ్లడంతో వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డుసభ్యులు, గుమస్తాలు కుమారస్వామి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేట పంచాయతీలో వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

'ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయండి'


మండల సమాఖ్య కార్యాలయంలో జరుగుతున్న సమావేశం

అచ్యుతాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో రైతులు శతశాతం ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అధికారులు సూచించారు. ఇప్పటికే జగ్గన్నపేటను ప్రకృతి వ్యవసాయ గ్రామంగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.ప్రభాకరరావు, ఏఓ శంకర్ గోవింద్, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

పొదుపు సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయంలోను రాణించాలని మండల వ్యవసాయాధికారిని సి.సుమంత అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పద్మ, వెలుగు సీసీలు, వీఏఏలు, ఎంపీఈఓ, వీఓఏలు, మహిళా సంఘాల సిబ్బంది హాజరయ్యారు.

గెడ్డ పూడ్చి రోడ్డు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారా?

ఆర్‌టీ యాక్టు దరఖాస్తుపై స్పందించని అధికారులు : వైఎస్ఎన్ మూర్తిరాజు

ఎస్.రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమాచార హక్కు చట్టం అమలు జరగడం లేదని పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన యేజెర్ల సత్యనారాయణమూర్తిరాజు అన్నారు. సోమవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదగుమ్ములూరులో కొండ గెడ్డను పూడ్చి రోడ్డును నిర్మించారని, ఇందుకు సంబంధించి ఇచ్చిన అనుమతుల వివరాలు తెలియజేయాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా గత ఏడాది 11వ నెలలో తహసీల్దార్, స్థానిక వీఆర్‌వోకు రిజిస్టర్ పోస్టులో దరఖాస్తు చేశానన్నారు. నిబంధనల ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాల్సిన అధికారులు వంద రోజులు గడుస్తున్నా ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. కొందరు స్వలాభం కోసం కొండగెడ్డను పూడ్చి రోడ్డు నిర్మించినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. వంద రోజులు గడిచినా సమాచారం ఇవ్వని అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు సత్యనారాయణమూర్తిరాజు తెలిపారు.

అనాథ ఆశ్రమంలో హోంమంత్రి జన్మదిన వేడుకలు

అచ్యుతాపురం రూరల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత జన్మదినం పురస్కరించుకుని సోమవారం మండలంలోని కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్ అనాథ పిల్లల ఆశ్రమంలో పిల్లలతో కేక్ కట్ చేశారు. చిల్డ్రన్స్ ఫిల్మ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఇచ్ఛా ఫౌండేషన్ చైర్మన్ వి.సంతోష్, వైస్ చైర్మన్ చలమల వెంకటేశ్వరరావు, సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. అలాగే వారికి కావలసిన నెలసరి ఖర్చులను అందజేశారు.

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న జడ్పీ సీఈవో


ఉపమాక వెంకన్నను దర్శించుకుంటున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

నక్కపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వేంకటేశ్వరస్వామిని సోమవారం జిల్లాపరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి దర్శించుకున్నారు. ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు సీఈవో గోత్ర నామాలతో పూజా కార్యక్రమాలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆయన వెంట ఎంపీడీవో సీతారామరాజు, సెక్రటరీ జయప్రకాశ్ వున్నారు.

'క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి'

అచ్యుతాపురం రూరల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి):క్షయ వ్యాధి నిర్మూలన కోసం వైద్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యుడు డి.రవిబాబు పిలుపునిచ్చారు. హరిపాలెం పీహెచ్‌సీలో సోమవారం ప్రపంచ క్షయ దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ మహమ్మారిని 2030 సంవత్సరం నాటికి పూర్తిగా నిర్మూలించడానికి ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక వేసిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మానస, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, సిబ్బంది రామలక్ష్మి, సునీత, ఉమామహేష్, నాగేశ్వరరావు, జోష్న, సుందరి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న హరిపాలెం ఆసుపత్రి సిబ్బంది

డ్రోన్ల వినియోగంతో డబ్బు, సమయం ఆదా

- వాడ్రాపల్లి క్షేత్ర పర్యటనలో ఏడీఏ సుబ్రహ్మణ్యం


డ్రోన్‌లు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న డ్రోన్‌లు ఇప్పుడు వ్యవసాయ రంగానికి కూడా భరోసాగా నిలుస్తున్నాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలో వాడ్రాపల్లిలో డ్రోన్‌లు వినియోగంపై సోమవారం క్షేత్రస్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్‌లు వినియోగంతో డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో జ్యోత్స్నకుమారి, ఏఈవో సాయివాణి, తులసి, రైతులు మళ్ల వరహా నర్సింగరావు, మళ్ల జోగినాయుడు పాల్గొన్నారు.

చోడమాంబిక ఆలయంలో దశమి ఏకాదశి పూజలు


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు, పెద్దలు

అచ్యుతాపురం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడపల్లిలోని చోడమాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం దశమి ఏకాదశి సందర్భంగా వంద మందికి పైగా మహిళలు ఆలయాన్ని శుభ్రపరచి, ప్రత్యేక పూజలు ఆచరించారు. అనంతరం వచ్చే నెల 7, 15 తేదీల్లో జరిగే అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వడిశల సన్యాసినాయుడు, మాజీచైర్మన్ కర్రి నాగేశ్వరరావు, పెద్దలు కర్రి రమణ, అనసూరి శ్రీనివాసరావు, గెంజి అప్పలరాజు, లావేటి లీలా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పరిహారంగా చెక్కులే ఇవ్వాలి

- టీడీఆర్‌లు వద్దంటూ కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి

మునగపాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లపై అధికారులు సమాధానం చెప్పకుండా రోడ్డు విస్తరణ చేస్తామని ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని రోడ్డు విస్తరణ నిర్వాసితులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల నిర్వాసితులు జిల్లా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బొడ్డేడ రామచంద్రరావు మాట్లాడుతూ భూసేకరణ సమయంలో నష్టపరిహారాన్ని నగదు, చెక్‌ల రూపంలో ఇస్తామని చెప్పి ఇప్పుడు టీడీఆర్ బాండ్లు ఇస్తామనడం మోసపూరితమేనన్నారు. టీడీఆర్ బాండ్లు తీసుకోబోమని, విధానం మార్చుకోకపోతే భూములు, స్థలాలు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు ఆడారి గణపతి అచ్చింనాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి శ్రీరామ్, పెంటకోట జగన్నాథరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం


సాంబమూర్తి దేవాలయంలో చేస్తున్న శివపార్వతుల కల్యాణం

మునగపాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబమూర్తి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం వేడుకగా జరిగింది. ఆలయ ఐదో వార్షికోత్సవంలో భాగంగా సోమవారం వేకువజాము నుంచి శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన అన్నమయ్య కీర్తనలు, కోలాటం, భరత నాట్యం ప్రదర్శనలు భక్తులను అలరించాయి. కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా సీతారాముల పెళ్లిరాట


రామాలయ ఆవరణలో పెళ్లిరాట వేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగవరం రోడ్డులోని సీతారామాలయంలో వచ్చే నెల 6వ తేదీన జరగనున్న సీతారామ కల్యాణం పురస్కరించుకుని సోమవారం పెళ్లి రాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రాల నడుమ వానర సేన సభ్యులతోపాటు పలువురు మహిళా భక్తులు పెళ్ళిరాటను వేశారు. ఈ కార్యక్రమంలో వానర సేన సభ్యులు జగతా శ్రీను, కొసిరెడ్డి నాగేశ్వరరావు, మామిడి వెంకటేశ్వరరావు, ధనిశెట్టి బుజ్జి, గంగిరెడ్డి కనకరాజు, కొసిరెడ్డి నరసింహమూర్తి, ఇంటి ఈశ్వరరావు, బూడిద గౌరీశంకర్ పాల్గొన్నారు.

మెప్మాకు అవార్డు రావడం అభినందనీయం

- ఎమ్మెల్యే విజయకుమార్


మెప్మా సిబ్బందిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మెప్మాకు మూడు ప్రపంచ రికార్డులు రావడం అరుదైన విషయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురంలోని తన నివాసంలో సోమవారం మెప్మా సిబ్బందిని ఆయన అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు జరపడం అభివృద్ధికి సోపానమన్నారు. ఈసందర్భంగా మెప్మా పీడీ సరోజిని, సీఎంఎం పద్మావతి, ఆర్‌పిలు,సభ్యులను అభినందించారు.


గౌరీపట్నం రోడ్డును సర్వే చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

గౌరీపట్నం-వడ్డాది రోడ్డుకు అధికారుల సర్వే

చోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నం నుంచి వడ్డాది వరకు రహదారి నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులు సోమవారం సర్వే చేపట్టారు. గౌరీపట్నంలోని ఎలిసెట్టి, కొరసాల కళ్లాల మీదుగా వడ్డాదిని కలుపుతూ ఉన్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని రైతులు, కూటమి నాయకులు చేసిన వినతిపై ఎమ్మెల్యే రాజు ఆదివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మండల ఇంజినీరింగ్ అధికారి శాంతారాం, ఇంజినీరింగ్ సిబ్బంది కలిసి రోడ్డును సర్వే చేశారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతికి పంపుతామని మండల ఇంజినీరు తెలిపారు. అనుమతి రాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.14.11 కోట్లతో అభివృద్ధి పనులు


రిబ్బన్ కట్ చేసి కల్వర్టు ప్రారంభిస్తున్న పద్మావతి

నర్సీపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పార్టీలకు అతీతంగా రూ.14.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి తెలిపారు. శివపురం మెయిన్ రోడ్డులో రూ.50 లక్షలతో నిర్మించిన కల్వర్టును 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వార్డుల్లో వీధి దీపాలు కూడా వేయించుకో లేని పరిస్థితి ఉండేదని, కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తొమ్మిది నెలల కాలంలోనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నాయని చెప్పారు. సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, పెదిరెడ్ల చింతు, ఆర్అండ్‌బీ డీఈ, ఏఈ పాల్గొన్నారు.

రికార్డుల్లో సాగుదారుల పేర్లు నమోదుచేయాలి

▸▸ గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు గిరి రైతుల వినతి


అధికారులకు సమస్యను వివరిస్తున్న పీవీటీజీ గిరిజనులు

చీడికాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లుగా సాగుచేస్తున్న అటవీ భూములకు రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసి సాగు హక్కు కల్పించాలని కోనాం శివారు కొత్తవీధి గిరిజన గ్రామానికి చెందిన పలువురు పీవీటీజీ రైతులు మొర పెట్టుకున్నారు. కోనాం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 289/1లో 37.08 ఎకరాలకు సాగు హక్కు కల్పించాలని గ్రామానికి చెందిన గెమ్మిలి చంటి, భాస్కరరావు, కోట కొండలరావు, జన్ని లక్ష్మణరావుతో పాటు మరో 15 మంది పీవీటీజీ రైతులు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి ఫేషికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర లీగల్‌సెల్ అడ్వయిజర్ త్రినాథ్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగసుధ, చీడికాడ డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజులు సోమవారం గ్రామానికి వెళ్లి రైతులతో సమావేశమయ్యారు. భూముల్లో తుప్పలు తొలగించి దిబ్బలను చదునుచేసుకొని జీడిమామిడి, మామిడి మొక్కలు వేసుకున్నామని, ఆ ఫలసాయంతోనే జీవనం సాగిస్తున్నామని రైతులు తెలిపారు. రైతుల నుంచి వివరాలు తీసుకున్న అనంతరం రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను అధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్, రాష్ట్ర అధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. ఈ విచారణలో వీఆర్వో జీవీ.మూర్తి, పీఎస్.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండవ నీరు లీకేజీలు లేకుండా చూడండి


తాండవ మెయిన్ గేట్ల లీకేజీలను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

నాతవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాండవ మెయిన్ గేట్ల నుంచి లీకేజీల రూపంలో నీరు వృథాగా పోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెకానికల్ డీఈ ఎస్.రవికాంత్ సూచించారు. సోమవారం తాండవ ఈఈ బాలసూర్యం, డీఈఈ అనురాధతో కలసి లీకేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మరమ్మతు పనులు ఎలా చేపట్టాలో ఆయన సూచించారు. అనంతరం తాండవ ఎడమ కాలువ 17.7 వద్ద అక్విడెక్ట్ మరమ్మతు పనులను తాండవ ఈఈ బాలసూర్యం పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని డీఈఈ అనురాధకు సూచించారు ఈ కార్యక్రమంలో మెకానికల్ ఏఈ ఉమాశ్రీ, ఏఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో తేజశ్విని సత్తా


పతకంతో తేజశ్విని

దేవరాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పారా టేబుల్ టెన్నిస్ పోటీల్లో దేవరాపల్లికి చెందిన గుల్లిపల్లి తేజశ్విని సత్తా చాటింది. కొమ్మాది నవోదయలో తొమ్మిదో తరగతి చదువుతున్న తేజశ్విని హైదరాబాద్ క్రీడా స్కూల్‌లో తర్ఫీదు పొందుతున్నది. గుజరాత్‌లో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించింది.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెరగాలి

మాకవరపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆసక్తి పెరగాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నారాయణరాజుపేట గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేసినట్టు చెప్పారు. అలాగే మరి కొన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తున్నదని, ప్రతీ రైతు ఈ వ్యవసాయం చేసి లబ్ధి పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి

మాడుగుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రైతులతో ధర్నా చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దళారీల చేతిలో దోపిడీకి గురై నష్టపోతున్నారన్నారు. 80 కిలోల బస్తా వ్యాపారులు రూ.7 వేలకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సంఘ నాయకులు పాల్గొన్నారు.

చేపల చెరువు ఆదాయం హాంఫట్


గిడుతూరులోని చుక్కలయ్య చెరువు

గిడుతూరు చుక్కలయ్య చెరువుపై అధికారుల నిర్లక్ష్యం
చేపల ఆదాయం, కొబ్బరి చెట్ల ఫలసాయం పక్కదారి
నీటి సంఘం ప్రెసిడెంట్‌గా ఎవరుంటే వారిదే ఇష్టారాజ్యం
15 ఏళ్లుగా ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని వైనం
ఇతర చెరువుల ఆదాయానిదీ అదే దారి

నర్సీపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలం గిడుతూరు చుక్కలయ్య చెరువు ఆదాయం పక్కదారి పడుతోంది. చేపలు, కొబ్బరి చెట్ల మీద ఆదాయాన్ని నీటి సంఘం అధ్యక్షులు ఎవరుంటే వారు మింగేస్తున్నారు. దీనిపై 15 ఏళ్లుగా అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాకవరపాలెం జడ్పీటీసీ మాజీ సభ్యుడు, గిడుతూరు మాజీ సర్పంచ్ చిటికెల వెంకట రామచంద్రరావు మరోసారి వినతిపత్రం ఇచ్చారు.

గిడుతూరులోని చుక్కలయ్య చెరువు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చుట్టూ చెరువు సరిహద్దులో 250 కొబ్బరి చెట్లు ఉంటాయి. ప్రతీ సంవత్సరం కొబ్బరి చెట్లు ఫలసాయం, చేపలు పట్టుకోవడానికి బహిరంగ వేలం వేస్తుంటారు. ప్రతి ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఈ ఆదాయంలో నిబంధనలు మేరకు నీటి సంఘానికి 90 శాతం, పంచాయతీకి పది శాతం వెళ్లాలి. అయితే ఈ ఆదాయాన్ని నీటి సంఘం అధ్యక్షులు ఎరుంటే వారు సొంతానికి వాడుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని రామచంద్రరావు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇదే విధంగా మాకవరపాలెం పంచాయతీ పాపయ్య చెరువు, రామన్నపాలెం చెరువులు ఆదాయం కూడా తినేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జల వనరుల శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

దీనిపై ఇరిగేషన్ డీఈఈ బాలసూర్యంని వివరణ కోరగా గిడుతూరు చెరువు ఆదాయం ఏమవుతుందో తనకు తెలియదన్నారు. ఈ ఏడాది చెరువులో చేపల వేలం పాటకు అనుమతులు ఇచ్చామని, కొబ్బరి చెట్ల ఫలసాయానికి ఇవ్వలేదని తెలిపారు. ఈవోపీఆర్‌డీ ఆధ్వర్యంలో వేలం వేస్తామని ఆయన చెప్పారు.

వడగళ్ల వర్షం.. ప్రజల ఉపశమనం


కృష్ణాదేవిపేటలో జోరు వాన..
చీడికాడలో కురిసిన వడగళ్లు →

చోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి సోమవారం కురిసిన వడగళ్ల వారన ఊరటనిచ్చింది. మధ్యాహ్నం 2 గంటల వరకూ భీకరంగా ఎండకాసింది. అనంతరం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మబ్బులు కమ్మిన తరువాత 2.40 గంటల సమయంలో ఉరుములు, వడగళ్లతో సుమారు అర గంట పాటు భారీ వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడి పోవడంతో స్థానికులు వేడి నుంచి ఉపశమనం పొందారు.

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, విప్పులపాలెం, ఏఎల్‌పురం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో సోమవారం మోస్తర వర్షం పడింది. వారం రోజులుగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. అయితే కృష్ణాదేవిపేట సంతలో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మోస్తరు వర్షం పడింది. వారం రోజులుగా ఎండతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. ఎండలు ఎక్కువై భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో వాన పడడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష

తండ్రి మరణించిన విషాదంలోనే పరీక్ష రాసిన పదో తరగతి విద్యార్థి గౌరీశంకర్


తీవ్ర విషాదంతోనే పరీక్ష రాస్తున్న గౌరీశంకర్ (సర్కిల్)

దేవరాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ కాలనీకి చెందిన రొంగలి గౌరీశంకర్ పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. తన తండ్రి సింహాచలం మరణించారని తెలిసి కూడా, తీవ్ర విషాదంలో పరీక్ష రాశాడు. ఈ దృశ్యం అందరినీ కంట తడి పెట్టించింది. మోడల్ కాలనీకి చెందిన రొంగలి సింహాచలం (42) క్యాన్సర్ బారినపడి ఇంటి దగ్గరే చికిత్స పొందుతున్నాడు. బుట్టలు అల్లుకొని జీవించే నిరుపేద కుటుంబానికి చెందిన అతనికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గౌరీశంకర్ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం రాత్రి సింహాచలం మృతి చెందారు. దీంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. తండ్రి మృతదేహం వద్దే రాత్రంతా గౌరీశంకర్ ఉన్నాడు. సోమవారం పరీక్షకు సమయం దగ్గర పడడంతో అంతిమ యాత్రలో పాల్గొనకుండానే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తెనుగుపూడి పరీక్షా కేంద్రానికి వెళ్లాడు. ఓ వైపు దుఃఖాన్ని దిగమింగుతూనే మరోవైపు భవిష్యత్తుకు ఉపయోగపడే పరీక్ష రాశాడు. వచ్చేసరికే దహన కార్యక్రమాలు పూర్తికావడంతో భోరున విలపించాడు.

ఆస్పత్రి నుంచి పరీక్ష కేంద్రానికి...


చేతికి సిమెంట్ కట్టుతో పరీక్షకు హాజరైన ఉపేంద్ర

దేవరాపల్లి: అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పెదగంగవరానికి చెందిన పెనగంటి ఉపేంద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఇంటి దగ్గర గోడపై నుంచి ప్రమాద వశాత్తు పడిపోవడంతో కుడి చేయి విరిగిపోయింది. కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకువెళ్లి సిమెంట్ కట్టు వేయించారు. హాస్పటల్‌లో ఉండి చికిత్స పొందాలని వైద్యులు సూచించినప్పటికీ సోమవారం తెనుగుపూడి పరీక్షా కేంద్రానికి హాజరయ్యాడు. పరీక్షల నిర్వహణాధికారి అనుమతితో వేరే విద్యార్థి సహకారం తీసుకుని పరీక్ష రాశాడు.

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో డీఈవో తనిఖీలు

నాతవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాతవరం, డి.యర్రవరం ఉన్నత పాఠశాల కేంద్రాలను ఆయన సందర్శించి ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్ లేకుండా పరీక్షలను పగడ్బందీగా జరపాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులు ఇబ్బందులు లేకుండా తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1, 2 సత్యనారాయణ, కె.వరహాలబాబు, స్క్వాడ్ బృందం సాయిశైలజ పాల్గొన్నారు.


క్షతగాత్రుడికి ఎమ్మెల్యే రాజు పరామర్శ

బుచ్చెయ్యపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమళ్లపూడి పంచాయతీలో బుదిరెడ్లపాలెం గ్రామానికి చెందిన మరిసా శివ ద్విచక్ర వాహనంపై బ బోల్తా పడి గాయపడ్డాడు. అతన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణకు సూచించారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

చోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎడ్లవీధిలో ప్రభుత్వ బోరుతో పాటు పంచాయతీ స్థలం ఆక్రమణపై చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఎడ్లవీధిలో పంచాయతీ స్థలంలో ఉన్న బోరు చుట్టూ గోడ కట్టారని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని విమర్శించారు. ఈ ఆక్రమణపై అధికారులు చర్యలు చేపట్టని పక్షంలో ఆందోళనకు దిగాల్సి వస్తుందని అప్పలరాజు హెచ్చరించారు.

వాసవీ జాగృతి క్లబ్ జిల్లా గవర్నర్‌గా మధు


మధు

చోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వాసవీ జాగృతి క్లబ్ జిల్లాగవర్నర్‌గా పట్టణానికి చెందిన ఎస్.వీ.మధు నియమితులయ్యారు. ఏలూరులో సోమవారం జరిగిన వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ సమావేశంలో మధు జిల్లా గవర్నర్‌గా ప్రమాణం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా మాడుగులకు చెందిన శ్రీనాథు శ్రీనివాసరావు, కేబినెట్ కార్యదర్శిగా కందుకూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా టి.సుబ్రహ్మణ్య గుప్తా నియమితులయ్యారు.

గంజాయి నిందితుడి అరెస్టు

కృష్ణాదేవిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర సంవత్సరాల నుంచి గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని ఎట్టకేలకు అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. 2021లో 16 కిలోల గంజాయి పట్టుబడడంతో కేసు నమోదైందన్నారు. ఇందులో నిందితుడిగా ఉన్న తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా తెల్లబెల్లి గ్రామానికి చెందిన నల్లపాటి వెంకటేశ్వర్లు పరారీలో ఉండగా, సోమవారం పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అనంతరం నర్సీపట్నం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

ఎరకన్నపాలెంలో పూరిల్లు దగ్ధం

మాకవరపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి పంచాయతీ శివారు ఎరకన్నపాలెం గ్రామంలో సోమవారం అచ్చియ్యమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంటిలో నుంచి మంటలు చెలరేగగా, స్థానికుల సమాచారంతో అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. తహసీల్దార్ రామారావు బాధితులను పరామర్శించారు.

84.48 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

నర్సీపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో రూ.84.48 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. సోమవారం శివపురంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమమే అభివృద్ధి అంటూ ఊదరగొట్టారని, ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. స్థానిక పెద్ద చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకు శాప్ చైర్మన్‌తో మాట్లాడుతున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మండల స్థాయిలో ప్రచారం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో 50 వేలకు పైగా పార్టీ సభ్యత్వం నమోదై రికార్డు సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి


అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన

దేవరాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం హేయమైన చర్యని, నిందితులు ఎంతటి వారైనా వదలకుండా శిక్షించాలని వారు కోరారు. అలాగే ఎస్సీ వర్గీకరణను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం రైవాడ అతిథి గృహం వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుల గణన తరువాత ఎస్సీ వర్గీకరణ చేయాలని కమిటీ మండల నేత కాటపల్లి అప్పారావు కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దేవస్థానం భూమి ఆక్రమణల పరిశీలన


భూమిని సర్వే చేస్తున్న సర్వే సిబ్బంది

బుచ్చెయ్యపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది నీలకంఠేశ్వరస్వామి ఆలయ భూమి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేశారు. ఆలయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి కంచె వేసినట్టు గుర్తించిన దేవదాయ శాఖ ఈవో డీ ఎస్ఎస్.శర్మ తహసీల్దార్ ఎం.లక్ష్మికి ఫిర్యాదు చేసి సర్వే చేయాలని కోరారు. తహసీల్దార్ వెంటనే స్పందించి వీఆర్వో మాణిక్యం, మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్‌ను పంపించి దేవస్థానం భూమిని సర్వే చేయించారు. ఈ విషయమై ఈవోను వివరణ కోరగా సుమారు 75 సెంట్లు ఆక్రమణకు గురైనట్టు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసి దేవస్థానం సిబ్బందితో ఆక్రమణను తొలగిస్తామని తెలిపారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో డిగ్రీ కళాశాలకు బహుమతి

నర్సీపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తృతీయ బహుమతి వచ్చిందని ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. కళాశాలలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్న సరమండ సురేశ్, మర్రి కామరాజు తృతీయ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణ, అధ్యాపకుడు నారాయణరావు అభినందించారు.

28న ఎం.అలమండలో ఎడ్ల పరుగు పోటీలు

దేవరాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అమండలో నూకాంబికా కొత్త అమావాస్య జాతర సందర్భంగా ఈ నెల 28న ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. విజేతకు పావు తులం బంగారం, రన్నర్స్‌కు రూ.16 వేలు అందించనున్నట్టు చెప్పారు. అలాగే తర్వాత ఆరు స్థానాల్లో నిలిచిన వారికి కూడా నగదు బహుమతులు ప్రదానం చేస్తామని వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బుచ్చెయ్యపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు 24 మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏఈ సోమరాజు తెలిపారు. కొత్త విద్యుత్ సరఫరా స్తంభాలు వేస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంటు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులంతా గమనించి సహకరించాలని కోరారు.

నాలుగు తాగునీటి బోర్ల నిర్మాణానికి శంకుస్థాపన

చీడికాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదవరలక్ష్మి నిధులతో సోమవారం నాలుగు తాగునీటి బోర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన వేచలపు కామేశ్ కళ్లాల వద్ద వీటి నిర్మాణానికి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు కె.నారాయణమూర్తి, ముత్యాలనాయుడు, ఎస్.కొండబాబు, జి.బాలాజీ పాల్గొన్నారు.

జీడిమామిడి తోటలు దగ్ధం

రోలుగుంట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరవోలులో సోమవారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో పది ఎకరాల సరుగుడు, జీడిమామిడి, టేకు తోటలు దగ్ధమయ్యాయి. గ్రామ శివారున నిట్టావారి పాకల సమీపంలో ఉన్న నిట్టా కల్యాణం, రాళ్లపల్లి రమణ, గెదేల అప్పలనాయుడు, గొర్లె రామన్, కర్రి అప్పలనాయుడుకు చెందిన సరుగుడు, టేకు, జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా తోటలన్నింటినీ చుట్టుముట్టాయి. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి పది ఎకరాల సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు.

సీసీ కెమెరాలు అమర్చాలని పోలీసులకు వినతి

దేవరాపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి) మండలంలోని బి.కింతాడ గ్రామంలో ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు అమర్చాలని తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు, మరికొంత మంది నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్ఐ టి.మల్లేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోన ఈశ్వరరావు, విడుదల సత్యారావు, సత్తిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నలుగురు పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు

మాకవరపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో నలుగురు పంచాయితీ కార్యదర్శులకు టీబీ ముక్తా అవార్డులు వచ్చాయని ఎంపీడీవో సీతామహలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దిన జి.గంగవరం, జెడ్.గంగవరం, బయ్యవరం, బీఎస్.పేట పంచాయతీల కార్యదర్శులతో పాటు వైద్య సిబ్బంది సుధీర్‌కు టీబీ ముక్తా అవార్డులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు అందించినట్టు ఆమె చెప్పారు.

గొలుగొండలో ముగ్గురికి...

గొలుగొండ: మండలంలోని టీబీ ముక్తా భారత్‌లో భాగంగా పుత్తడిగైరంపేట, కంఠారం, కొత్తమల్లంపేట పంచాయతీలను ప్రభుత్వం గుర్తించింది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా సోమవారం అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ హాస్పటల్‌లో టీబీ రహిత గ్రామాల కార్యదర్శులు రాజేశ్, జగదీశ్వరి, శ్రీనివాస్‌లను జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ బాలాజీ బహుమతులు అందించారు.

వాకపల్లి మాజీ సర్పంచ్ సింహాచలమ్మ మృతి

దేవరాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వాకపల్లి మాజీ సర్పంచ్ సబ్బవరపు సింహాచలమ్మ (106) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమెకు ఆరుగురు ఆడపిల్లలు కాగా, వారి పిల్లలు దాదాపు 32 మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు నివాళులర్పించారు.

జీడిమామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రావికమతం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. కొట్నాబిల్లి గ్రామంలో సోమవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వేలాది ఎకరాలలో జీడిమామిడి తోటలపై ఆదివాసీలు, నిరుపేద రైతులు జీవిస్తున్నారన్నారు. తెగుళ్ల కారణంగా పంట పోయిందని, ప్రభుత్వం గుర్తించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పి.బెన్నయ్య, పాడి ఎర్రయ్యమ్మ, దేవుడమ్మ పాల్గొన్నారు.

27న జి.మాడుగుల ఎంపీపీ ఎన్నిక

జి.మాడుగుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్. డేవిడ్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యుడు విధిగా హాజరుకావాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

మీకోసంలో సమస్యల సత్వర పరిష్కారం

కొయ్యూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతి సోమవారం మండల కేంద్రంలో మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని తహసీల్దారు ఎస్ఎల్‌వీ ప్రసాద్ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై నాలుగు దరఖాస్తులందాయి.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో వివిధ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె. సుమ మాధురి తెలిపారు. ఆరో తరగతిలో 60, ఏడు, తొమ్మిది తరగతుల్లో ఒక్కొక్క సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్ ఎంఈసీ గ్రూప్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయన్నారు. అర్హత గల విద్యార్థినులు ఏప్రిల్ 11తేదీలోగా ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇరిగేషన్ స్థలం పరిరక్షణకు చర్యలు : ఏఈఈ

» 'ఆంధ్రజ్యోతి'ఎఫెక్ట్

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో జలవనరుల శాఖ స్థలం పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాడేరు సబ్ డివిజన్ ఏఈఈ డి. లోకేశ్ కుమార్ తెలిపారు. సోమవారం 'ఆక్రమణల చెరలో ప్రభుత్వ స్థలాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పాడేరు సబ్ డివిజన్ జలవనరుల శాఖ అధికారులు స్పందించారు. పరిపాలన సౌలభ్యం కోసం చింతపల్లి సబ్ డివిజన్ కార్యాలయాన్ని పాడేరుకి బదిలీ చేశారని ఏఈఈ లోకేశ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం చింతపల్లిలోని జలవనరుల శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, నిధులు విడుదల కాగానే నూతన భవనం నిర్మిస్తామన్నారు. ఈ స్థలం ఆక్రమణనకు గురికాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు.

సీలేరులో ఘనంగా ఇఫ్తార్ విందు

సీలేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీలేరు మసీద్‌లో సోమవారం ముస్లింలు ఇతర మతస్థులకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు సందర్భంగా సీలేరులోని జెన్‌కో అధికారులు, సిబ్బంది, వర్తక సంఘం, రాజకీయ నాయకులు, ఉద్యోగులకు ముస్లిం పెద్దలు ఆహ్వానించి, వివిధ రకాల వంటకాలతో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):పాడేరు, కొయ్యూరు మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లలో పెయింటింగ్ పనులు, ఇతర మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో 25వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్ఎం.అప్పారావు తెలిపారు. పాడేరు మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, అలాగే కిండంగి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వంట్లమామిడి, మినుములూరు, తుంపాడ, కిండంగి, సలుగు, లగిశపల్లి, వంజంగి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.అదేవిధంగా కాకరపాడు విద్యుతు సబ్ స్టేషన్‌లో పెయింటింగ్, మరమ్మతులకు తదితర పనులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుతు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు మండలంలోని కొయ్యూరు, కాకరపాడు, సింగవరం, రాజేంద్రపాలెం, చింతవానిపాలెం, పిట్టచలం, నడిమిపాలెం, ఎం.మాకవరం, చింతలపూడి, గింజర్తి, చీడిపాలెం, దొడ్డవరం, మర్రివాడ, గుడ్లపల్లి, బూదరాళ్ల, లూస, మంప, రేవల్ల, తుమ్మలబంధ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. రెండు మండలాల విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

26న ఐటీఐలో జాబ్‌మేళా

అరకులోయ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అరకులోయ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్ పి.రోహిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మదర్ అండ్ ఫాదర్ హెల్త్ కేర్ సర్వీసెస్, రిలయబుల్ నియో స్పేస్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయబుల్ ఫైర్ అండ్ సేఫ్టీ సర్వీసెస్‌లో 164 ఉద్యోగాలు ఉన్నట్టు ఆమె తెలిపారు. పదో తరగతి, జీఎన్ఎం, ఏఎన్ఎం, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం 9491057527, 9949927899 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రామాలయ భూమి పరిరక్షణపై అధికారులు దృష్టిసారించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం భూమిని పరిరక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో తహసీల్దార్ నర్సమ్మకు వారు వినతిపత్రం అందించారు. రామాలయం నిర్మాణం సమయంలో సుమారు 25 సెంట్ల భూమిని కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం రామాలయం చెట్టూ భూఅక్రమణకు గురవుతుందని వారు వివరించారు. ఆలయానికి కేటాయించిన భూమిపై సర్వే చేసి, హద్దులు కేటాయించడం జరుగుతుందని, అక్రమణ చేసిన వారిపై శాఖా పరమైన చర్యలు చేపడతామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

మీ కోసం కార్యక్రమానికి స్పందన కరువు

ముంచంగిపుట్టు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ కోసం కార్యక్రమానికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్పందన కరువైంది. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కేవలం ఒక వినతిపత్రం మాత్రమే అందింది. మొదటి వారం స్పందనలో ఒక వినతి కూడా అందలేదు. రెండో వారం ఒకటి మాత్రమే వచ్చింది. ఈ కార్యక్రమానికి అధికారులు ప్రచారం చేయకపోవడంతో పాటు మండల స్థాయి అధికారులు ఆశించిన స్థాయిలో హాజరుకావడంతోనే ఈ దుస్థితి దాపురించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గాంధీనగర్ టెన్త్ పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్?

» రోడ్డుపై స్లిప్పులు దర్శనం



గాంధీనగర్ పరీక్ష కేంద్రం వద్ద రోడ్డు పక్కన పడేసిన స్లిపులు

జి.మాడుగుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో సోమవారం జరిగిన మేథమెటిక్స్ పరీక్ష అనంతరం స్లిప్పులు దర్శనమిచ్చాయి. దీంతో పదో తరగతి పరీక్షల్లో ఈ కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరుగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్ష అనంతరం గేటు ముందు రహదారిపై స్లిప్పులు వదిలారు. పగడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ పరీక్ష కేంద్రంలో స్లిప్పులతో విద్యార్థులు ఎలా ప్రవేశిస్తారని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ విషయమై ఎంఈవో బాబూరావు పడాల్‌ను ఫోన్లో వివరణ కోరగా.. గాంధీనగర్ పరీక్ష కేంద్రంలో ముగ్గురు రాష్ట్ర పరిశీలకులతోపాటు స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరో పరీక్ష ప్రశ్నపత్రాన్ని నింపి వదిలారని, మాస్ కాపీయింగ్‌కు అవకాశమే లేదని స్పష్టంచేశారు.

కాఫీ తరహాలో తేనెకు బ్రాండ్ తీసుకొచ్చేందుకు కృషి : ఏడీఆర్



రైతుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి, నాబార్డు డీడీవో చక్రధర్

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):కాఫీ తరహాలో తేనెకు చింతపల్లి బ్రాండ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహపరిశోధన సంచాలకులు(ఏడీఆర్) డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పరిశోధన స్థానంలో జరుగుతున్న శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ అరకులోయ ప్రాంతంలో పొరుగు జిల్లాల నుంచి వచ్చి తేనెటీగల పెంపకం చేపడుతున్నారన్నారు. గిరిజన రైతులు తేనెటీగల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసుకుంటే మంచి ఆదాయం వస్తుందన్నారు. గిరిజన రైతులు ఉత్పత్తి చేసిన తేనెను చింతపల్లి బ్రాండ్‌పై విక్రయిస్తే మార్కెట్‌లో మంచి ధర వస్తుందన్నారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి చక్రధర్ మాట్లాడుతూ తేనె ఉత్పత్తి చేసే రైతులందరూ క్లస్టర్‌గా ఏర్పాటు చేసుకోవడం వల్ల బ్యాంక్‌లు రుణాలు అందజేస్తాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు, ఆర్ఏ డాక్టర్ వెంకటేశ్‌బాబు, టీచింగ్ అసోసియేట్ బాబూజినాయుడు, టీచింగ్ అసిస్టెంట్ శ్వేత పాల్గొన్నారు.

పాడేరులో రోడ్డు పక్క దుకాణాల తొలగింపు

» అధికారుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన వ్యాపారులు

» భారీగా నిలిచిన వాహనాలు

» సీఐ హెచ్చరికతో ఆందోళన విరమణ



అంబేడ్కర్ కూడలిలో నిలిచిన వాహనాలు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

పాడేరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరు రహదారులకు ఇరువైపుల ఏర్పాటు చేసిన దుకాణాలను పంచాయతీ, రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం డీపీవో బి.లవరాజు, ఎంపీడీవో జె.తేజరతన్, ఈవోపీఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్, పోలీసులు శనివారం రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు తొలగించాలని వ్యాపారులను ఆదేశించారు. సోమవారంలోగా దుకాణాలను తొలగించాలని లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అయినప్పటికి దుకాణదారులు వాటిని తొలగించకపోవడంతో సోమవారం ఈవోపీఆర్డీ రమేశ్, వీఆర్‌వో రామునాయుడు తదితరులు షాపులను దగ్గరుండి తొలగించారు. దీంతో అంబేడ్కర్ కూడలిలో వ్యాపారులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సీఐ డి.దీనబంధ్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించడంతో వ్యాపారులు ఆందోళన విరమించారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలకు ఇంటర్వ్యూలు

పాడేరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు ఈనెల 26న పాడేరులో, 28న చింతపల్లిలో అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్టు జాబ్ కో-ఆర్డినేటర్ సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటరింగ్, మల్టీ స్కిల్స్ టెక్నీషియన్, రెస్టారెంట్ కెప్టెన్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్స్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్స్, ఇండస్ట్రీయల్ ఆటోమిషన్ స్పెషలిస్ట్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, సీఎన్‌సీ ఆపరేటర్, ఆటోమోటివ్స్ రంగాల్లో మూడు నెలలు విశాఖపట్నంలో శిక్షణ ఇస్తామన్నారు. ఆయా రంగాల్లో 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించనున్నామన్నారు. ఆసక్తి గల 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగి 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ విద్యను అభ్యసించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీన పాడేరు వెలుగు కార్యాలయంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఈనెల 28న చింతపల్లిలో నిర్వహించే ఎంపికకు చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్‌లతోపాటు కుల ధ్రువీకరణపత్రం, ఆధార్, రేషన్, ఉపాధి హామీ కార్డు, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లు 4 పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9492572737 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మాత, శిశు మరణాల నియంత్రణకు చర్యలు : ఏడీఎంహెచ్‌వో



ఎస్ఎన్‌సీయూలో శిశువులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ప్రతాప్

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతంలో మాత, శిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టీఎన్ ప్రతాప్ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలోని నవజాతశిశు సంరక్షణ కేంద్రాన్ని (ఎస్ఎన్‌సీయూ) తనిఖీ చేశారు. శిశువులకు అందుతున్న వైద్యసేవలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా మాత, శిశు మరణాలు సంభవించరాదని, గర్భిణులు కచ్చితంగా ఆస్పత్రిలో ప్రసవం పొందేలా ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించామన్నారు. శిశువులకు ఆదివాసీలు పసర, నాటు వైద్యం చేయరాదన్నారు. శిశువుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకొచ్చి మెరుగైన చికిత్స అందించాలన్నారు. నవజాతశిశు సంరక్షణ కేంద్రంలో అత్యాధునిక వైద్యం అందుతుందని, ఈ కేంద్రంలో ఖాళీ వైద్యుల పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వీనగర్ వైద్యాధికారి రాజా రవీంద్రనాథ్ చౌదరి, క్షయ పర్యవేక్షకుడు ప్రసాద్ కిశోర్ పాల్గొన్నారు.

ఏడీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

కొయ్యూరు: రాజేంద్రపాలెం పీహెచ్‌సీ ఏడీఎంహెచ్‌వో ప్రతాప్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్‌వో మాట్లాడుతూ 2008-09 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైద్యాధికారి పి.వెంకటరమణ పీహెచ్‌సీకి మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం చేసినట్టు అందిన ఫిర్యాదులపై అప్పట్లో విచారించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి రికార్డులు పరిశీలించామన్నారు. అయితే అప్పట్లో నిర్వహించిన విచారణలో నిధులు దుర్వినియోగం కాలేదని తేలినా.. మరోసారి రికార్డులు పరిశీలిస్తున్నట్టుగా తెలిపారు. ఆయన వెంట వైద్యాధికారి సంపత్‌బాబు, సీహెచ్‌వో ప్రశాంత్ పాల్గొన్నారు.

'తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు'



షాపులో తనిఖీ నిర్వహిస్తున్న అనూరాధ

సీలేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడినా, ఎంఆర్‌పీ ధరల కంటే అధిక రేట్లకు వస్తువులు విక్రయించినా చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ అధికారిణి డి.అనూరాధ వ్యాపారులను హెచ్చరించారు. ధారకొండ, సీలేరుల్లో సోమవారం లీగల్ మెట్రాలజీ అధికారిణి, తమ సిబ్బందితో కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధారకొండలో 7 కేసులు, సీలేరులో 5 కేసులు నమోదు చేసినట్టు లీగల్ మెట్రాలజీ అధికారిణి అనూరాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బీవీ రెడ్డి, రుషికేశ్, తదితర్లు పాల్గొన్నారు.

'క్షయపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'



చింతపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):క్షయపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ దినోత్సవం పురస్కరించుకుని ఆర్‌వీనగర్ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ రెండు వారాలపాటు దగ్గుతోపాటు జ్వరం ఉంటే కెల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చంద్రశేఖరరావు, రుక్మిణి, రాజా రవీంద్రనాథ్ చౌదరి, క్షయ పర్యవేక్షకుడు ప్రసాద్ కిశోర్ పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరులో ప్రపంచ క్షయ వ్యాధిని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఎస్కే ఖాదర్ మస్తాన్‌వల్లీ, కె.సౌమ్య ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఎన్.త్రినాథ్, బి.బాలామణి, ఏఎన్ఎంలు బి.దేవి, కుమారి పాల్గొన్నారు.

కొయ్యూరులో..

బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా క్షయ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చునని రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సంపత్‌బాబు సూచించారు. సోమవారం ప్రపంచ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ నివారణపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వై.అచ్చియనాయుడు, ఎంపీహెచ్ఈవో ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

మండల కేంద్రంలో క్షయపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిపై మానవహారంగా ఏర్పడి క్షయపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి కె.గీతాంజలి, కిలగాడ, లబ్బూరు పీహెచ్‌సీల వైద్యులు రమేశ్, శిరీష, శ్యాంప్రసాదు, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, విద్యార్థులు తదితర్లు పాల్గొన్నారు.

హుకుంపేటలో భారీ వర్షం



హుకుంపేట రోడ్డుపై హోరున కురుస్తున్న వాన

హుకుంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పడిన వర్షానికి రహదారులు చిత్తడయ్యాయి. వరద నీరు రోడ్లపై ఏరులై పారింది. మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చిన జనం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ గ్రామాలకు తిరిగి వెళ్లడానికి నరకం చూశారు. అయితే ఈ వర్షానికి వాతవరణం ఒక్కసారిగా చల్లబడిపోవడంతో మండల ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు.

యజమానుల నిర్లక్ష్యం.. గోవులకు శాపం!

గోడల మధ్య ఇరుకున్న ఆవు.. అతి కష్టంపై రక్షించిన ప్రజలు



గోడల మధ్యన ఆవు

పెదబయలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యజమానుల నిర్లక్ష్యం కారణంగా గోవులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. సోమవారం సీతగుంట సచివాలయంవీధిలో రెండు గృహాల గోడలకు మధ్యన ఓ ఆవు ఇరుక్కుని కొన ఊపిరితో కొట్టుమిట్టులాడింది. ఈ ఘటనను గమనించిన స్థానికులు పంచాయతీకి చెందిన వాట్సాప్ ప్రసార మాధ్యమంలో పోస్టు చేశారు. దీంతో పశు వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని గ్రామస్థుల సాయంతో అతి కష్టం మీద మూగ జీవికి రక్షించారు. అనంతరం వైద్య సిబ్బందికి ఆవుకు చికిత్స అందించారు. అయితే గోవుల యజమానులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడు మండలాల్లో వర్షం

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం వర్షం కురిసింది. సాయంత్రం మూడున్నర గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకుంది. ఈ వర్షం వ్యవసాయ పనులకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గూడెంకొత్తవీధిలో..

మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు వర్షం కురిసింది. వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండుకున్నాయి. వర్షం వల్ల ఆర్‌వీనగర్ వారపు సంతలో వర్తకులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

జి.మాడుగులలో..

మండలంలోని సోమవారం పలుచోట్ల జల్లులు కురిశాయి. రెండు రోజులుగా మేఘాలు వేస్తున్నా వర్షం కురియలేదు. సోమవారం పలు ప్రాంతాల్లో చినుకులు పడింది. దీంతో వర్షాలు కురుస్తాయనే ఆశాభావంలో రైతులు ఎదురుచూస్తున్నారు.

టెన్త్ గణితం పేపరుకు 104 మంది విద్యార్థులు గైర్హాజరు

పాడేరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన గణితం పరీక్షకు 99.19 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ తెలిపారు. సోమవారం జరిగిన లెక్కలు పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 11,665 మంది హాజరు కావాల్సి ఉండగా 11,561 (99.19) శాతం మంది హాజరయ్యారని, 104 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 18 మందికి 10 మంది (55.56)శాతం మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారన్నారు. అదేవిధంగా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీవోఎస్ఎస్)నిర్వహించే ఓపెన్ స్కూల్ పది పరీక్షలకు 86.47 శాతం మంది హాజరయ్యారన్నారు.

కాకనూరులో వైద్య శిబిరం

సీలేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం మారుమూల గుమ్మిరేవుల పంచాయతీ కాకనూరు గ్రామంలో సోమవారం ధారకొండ వైద్యాధికారి డీకే హిమబిందు ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. గ్రామంలో 64 మంది మహిళలు, చిన్నారులు, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.లోవకుమారి, ఏఎన్ఎం సీత, మత్స్యకొండ తదితర్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి మృతి



సత్యవతి(ఫైల్)

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ చిక్కం సత్యవతి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తూ బ్రెయిన్ స్ట్రోక్‌కి గురై కుప్పకూలిపోయిన ఆమెను ఐసీడీఎస్ అధికారులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె మృతదేహానికి స్వగ్రామం వంతమామిడిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు భర్త , ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సత్యవతి అకాలమృతిపై ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు, నర్సీపట్నం గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల ఆందోళన

చింతపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సోమవారం సీపీఎం నాయకులు, గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ కూలీలకు వేతనాలు, హౌసింగ్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. భూబదలాయింపు చట్టాన్ని పక్కా అమలుచేయాలని, జీవో నంబరు-3కి చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

'ఆర్‌వీనగర్ రోడ్డు నిర్మాణాలు ప్రారంభించాలి'



జీకేవీధిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

గూడెంకొత్తవీధి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీనగర్-పాలగెడ్డ అంతర్ రాష్ట్ర రహదారి నిర్మాణాలు ప్రారంభించాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు, సీపీఎం నాయకుడు అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నాయకులు మండలంలోని పలు సమస్యలపై ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ఆర్‌వీనగర్-పాలగెడ్డ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్టు ప్రకటించి ఆరు నెలలు కావస్తున్నప్పటికి నేటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, చంటిబాబు, మాజీ సర్పంచ్ బాబూరావు, జనసేన నాయకుడు సిద్ధార్థ మార్కు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

అనంతగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 108లో ప్రసవించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బొర్రా పంచాయతీ కొయిటిగుడ గ్రామానికి చెందిన జన్ని పవిత్ర నిండు గర్భిణి. ఆమెకు పురిటినొప్పులు వస్తుండడంతో 108కు సమాచారం అందించారు. గ్రామం నుంచి 108 వాహనంలో తరలిస్తుండగా, మార్గమధ్యంలోని రైల్వేగేటు సమీపంలో నొప్పులు అధిక కావడంతో ఈఎంటీ ప్రసాద్ వైద్య సేవలు అందించడంతో ప్రసవించింది. తల్లీబిడ్డను పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలను అందించారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా నీలకంఠం

పెదబయలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న కూడా నీలకంఠం జిల్లాలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషయన్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఆయనకు వైద్యశాఖ ఈ పత్రాన్ని బహూకరించింది. రానున్న కాలంలో గిరిజనులకు మరిన్ని సేవలు అందించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

ముగిసిన సీపీఎం చైతన్య యాత్ర

డుంబ్రిగుడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారంతో ముగిసింది. చైతన్య యాత్రలో వచ్చిన గిరిజన సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి సోనబారికి పోతురాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో రోడ్లు, తాగునీటి వనరులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేశ్ సత్యనారయణ, డోంబు, గిరిజనులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో భారీ వర్షం

- అనకాపల్లిలో 12.5 ఎంఎం వర్షపాతం నమోదు
- ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురవడంతో ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం


అనకాపల్లి మండలం కాపుశెట్టివానిపాలెంలో ఈదురు గాలులకు ఇంటి షెడ్డు పైకప్పు ఎగిరిపోయిన దృశ్యం


అనకాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్/ అనకాపల్లి రూరల్/ కశింకోట/ సబ్బవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి, కశింకోట, సబ్బవరం పరిసర ప్రాంతాల్లో సోమవారం ఆకస్మికంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. అనంతరం ఉరుములు, మెరుపులు,గాలులతో సుమారు ఇరవై నిముషాలకు పైగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించిపోయింది. పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచింది. అనకాపల్లిలో విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సబ్ వేల నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ స్తంభించింది. అనకాపల్లిలో 12.5ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తెలిపారు.

ఈదురు గాలులకు కాపుశెట్టివానిపాలెంలో ఎగిరిపోయిన పైకప్పు

ఇదిలావుంటే, అనకాపల్లి మండలంలోని రేబాక పంచాయతీ శివారు కాపుశెట్టివానిపాలెంలో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రేకుల షెడ్డు పైకప్పు ఎగిరిపోయింది. దీంతో అందులో అద్దెకు నివాసముంటున్న కరణం రమణకు సంబంధించిన గృహోపకరణాలు వర్షానికి తడిసిముద్దయ్యాయి. పేదరికంలో ఉన్న ఆ కుటుంబం గగ్గోలు పెడుతోంది.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీలు

అనకాపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో రవికుమార్ ఈ ర్యాలీ ప్రారంభించారు. టీబీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు, ఎన్టీఆర్ స్టేడియం మీదుగా తిరిగి కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నివారణాధికారి బాలాజీ, అనకాపల్లి ఐఎంఏ కోశాధికారి డాక్టర్ నరేష్ గుప్తాలు మాట్లాడుతూ క్షయవ్యాధిపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వారికి పురస్కారాలందజేశారు. వైద్యులు శ్రావణి, వెంకటేష్, సుభాష్, కనకఅప్పారావు, జహీరా పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట: క్షయ వ్యాధి పట్ల అంతా అవగాహన కలిగి ఉండాలని వెల్ఫేర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా తాళ్లపాలెం గురుకులంలో విద్యార్థులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నివారణ ఉపాయాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఉపాధ్యాయులు, స్టాఫ్ నర్స్ శ్రీదేవి పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : క్షయ వ్యాధి నిర్మూలనకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కనక అప్పారావు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : క్షయ వ్యాధి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వైద్యుడు డాక్టర్ కన్నంనాయుడు అన్నారు. ఇక్కడి అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ వ్యాధి ఎలా వస్తుంది, సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తదితరాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రామకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని మెరుగైన సేవలు’


ఎంపీపీ సూర్యకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సమావేశం

సబ్బవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా వైద్య సిబ్బంది పనిచేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. గుల్లేపల్లి పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగుల పట్ల ప్రేమతో వ్యవహరించి సేవలు అందించాలని చెప్పారు. ఆసుపత్రి అభివృద్ధికి రూ. 1,74,500 నిధులు విడుదలయ్యాయని, వాటిని అభివృద్ధికి సక్రమంగా వినియోగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ దమయంతి, కమిటీ సభ్యులు బోకం రామునాయుడు, సర్పంచ్‌లు బండారు మంగ, బైలపూడి గౌరి, యడ్ల నాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీపీసీ 50వ రైజింగ్ డే వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న హెచ్‌వోపీ సమీర్‌శర్మ

పరవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ఏర్పాటై యాభై వసంతాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడి దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి రైజింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని సంస్థ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌వోపీ) సమీర్‌శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1975లో ఎన్టీపీసీ ప్రారంభమై అంచెలంచెలుగా ఎదుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తిని చేయడంతో ముందుందన్నారు. ఉద్యోగులు, కార్మికుల కృషి ఫలితంగానే ఈ ప్రగతి సాధ్యమవుతున్నట్టు చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు సౌత్ సదరన్ హెచ్‌ఆర్ ఏజీఎం ప్రాణిగ్రాహితో పాటు సంస్థకు చెందిన వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి

- ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా


కలెక్టరేట్‌లో అర్జీదారుడితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌వో సత్యనారాయణరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాసరావులతో కలిసి ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి 372 అర్జీలు అందాయి.


జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎస్పీ తుహిన్ సిన్హా హాజరయ్యారు. ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి చట్ట పరిధిలో ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశించారు. 30 అర్జీలు అందగా అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలపై ఎక్కువగా ఉన్నాయని జిల్లా పోలీస్ కార్యాలయం ఎస్ఐ వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ ప్రజావేదిక రసాభాస

- సామాజిక తనిఖీల్లో బయటపడిన తప్పిదాలు
- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి వెల్లడి
- అవకతవకలు జరిగాయంటూ కూటమి నేతలు ఆరోపణ

కశింకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో సోమవారం ఏర్పాటైన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజా వేదిక రసాభాసగా మారింది ఈనెల 11 నుంచి 23వ తేదీ వరకు మండలంలోని 27 పంచాయతీల్లో 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన ఆడిట్ బృందం ఆయా గ్రామాల్లో జరిగిన పనుల నివేదికను ఇక్కడి ప్రజా వేదికలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ పూర్ణిమాదేవి ప్రతి గ్రామంలో జరిగిన పనుల నివేదికను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలం మొత్తం 12,500 మందికి జాబ్ కార్డులు మంజూరు చేశామని, వాటిలో ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సి ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.17కోట్లు పనులు జరిగాయన్నారు. వీటిలో చాలా చోట్ల ఒకరికి బదులుగా మరొకరు పని చేశారని, అంతేకాకుండా వీరికి వేలిముద్రలు లేకుండా డబ్బులు చెల్లించారని వివరించారు. అంతేకాకుండా ఎస్ఎంఎంఎస్ హాజరును ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా వేయకపోవడం వల్ల కొంత వరకు తప్పిదాలు జరిగాయని వెల్లడించారు. నవంబరులో ముందుగానే గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కాగా, వైసీపీ నేతల హయాంలో అవకతవకలు జరిగాయని, తక్షణమే చర్యలు తీసుకొని ఆ నగదును రికవరీ చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. అయితే ఎటువంటి అవకతవకలు జరగలేదని వైసీపీ నేతలు తెలియజేయగా, ఈ సమయంలో కాసేపు వాగ్వాదాలతో గందరగోళ వాతావరణం నెలకొంది.



ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి తదితరులు

‘ముఖ్యంగా మూడు పంచాయతీల్లో అవకతవకలు’

మండలంలోని ఈ.చౌడువాడ, సుందరయ్యపేట, అచ్చెర్ల పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో ప్రధానంగా అవకతవకలు జరిగాయని కూటమి నేతలు ఆరోపించారు. ఈ.చౌడువాడలో పీఈటీ (టీచర్)గా పనిచేస్తున్న వారిపై కూడా మస్తర్లు వేసి పేమెంట్లను తీసుకున్నారన్నారు. అలాగే వలంటీరుగా పనిచేస్తున్న వారికి కూడా ఉపాధి హామీ పనుల్లో మస్తరు వేసినట్లుగా గుర్తించినట్టు చెప్పారు. సుందరయ్యపేటలో పనిచేయకుండానే మస్తరుగా వేసి రూ.24వేలు నగదు డ్రా చేశారని ఆరోపించారు. అచ్చెర్లలో 17 మంది మాత్రమే వంద రోజులు చేసి వారిలో కొంత మంది పని చేయకుండానే మస్తరు వేసి డబ్బులు తీసుకున్నారని చెప్పారు. వీటన్నిటిపై పూర్తి విచారణ జరపాలని కూటమి నేతలు కర్రి సత్యనారాయణ, దొడ్డి నాగేశ్వరరావు, దాడి నాగరాజు, కూండ్రపు రామునాయుడు, నైనంశెట్టి రమణారావు తదితరులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, ఏపీడీ జె.మణికుమార్, ఏపీవో శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్థులు నినాదాలు

‘సింహాద్రి’ కాలుష్యం నుంచి కాపాడండి

- ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మూలస్వయంభూవరం గ్రామస్థుల ఆందోళన
- గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం డిమాండ్

పరవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ ద్వారా వెలువడుతున్న కాలుష్యం బారినుంచి తమను కాపాడాలంటూ కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామస్థులు సోమవారం ఇక్కడి మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ సింహాద్రి కాలుష్యం కారణంగా మూలస్వయంభూవరం ప్రజలు రోగాలతో అల్లాడుతున్నారన్నారు. పంటలు సైతం దెబ్బతింటున్నాయని అయినప్పటికీ ఇటు సంస్థ యాజమాన్యం గాని, అటు జిల్లా ఉన్నతాధికారులు గాని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే గ్రామంలో పలువురు చర్మ సంబంధిత రోగాలతో మంచాన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థకు చెందిన చిమ్నీల నుంచి వెలువడుతున్న ఉప్పు నీటి తుంపర్లు కారణంగా ఇళ్ల పైకప్పులు దెబ్బతినడంతో పాటు తలుపులు, కిటికీలు తప్పుపడుతాయన్నారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంస్థ పరిపాలన కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో కె.ధర్మారావు, తహశీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నగిరెడ్డి రామారావు, బొండా సూరిబాబు, బత్తిన రాముడు, మరిశా రవి, బొండా రాజు, బొండా సరోజిని, అనురాధ, బత్తిన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్న మీటర్ రీడర్లు

తుమ్మపాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. సోమవారం మీటర్ రీడర్లతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తులసీరావు, శ్రీనివాసరావు, సంతోష్, రవికుమార్, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములైన విస్సన్నపేటలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి

- జేసీ జాహ్నవికి జనసేన నాయకులు వినతి

కశింకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం రెవెన్యూ సర్వే నంబరు 195/2లో 609.24 ఎకరాల విస్తీర్ణంలో జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవిని జనసేన నాయకులు దూలం సాయిమణికుమార్, గోపీనాథ్ కోరారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికలో భాగంగా జేసీని సోమవారం కలిసి ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ 2020వ సంవత్సరం ఆఖరు నుంచి ఈ భూ అక్రమాలు నిర్విరామంగా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. నిబంధనలు పక్కన పెట్టి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వైసీపీ ప్రభుత్వంలో కొద్ది మంది బడా నేతలు, అధికారుల అండతో అక్రమ లేఅవుట్‌ను నిర్మాణం చేస్తూ, వాటిలో ఉన్న కొండలు, గెడ్డలు, అసైన్డ్ భూములు, ఇనాం భూములు, డి-పట్టా భూములు, సీలింగ్ ల్యాండ్‌లను అక్రమంగా చదును చేసి కబ్జా చేశారని ఆరోపించారు. 2021లో ఉమ్మడి జిల్లా కలెక్టర్ వేసిన కమిటీ నివేదిక నేటికీ బహిర్గతం కాలేదని వివరించారు. ఇప్పటికీ ప్రతి వారం అక్కడ పార్టీలు నిర్వహిస్తూ, ఈ లేఅవుట్‌కు సంబంధించి అన్ని అనుమతులు త్వరలోనే వస్తున్నాయని అమాయక వ్యక్తులతో పెట్టుబడులు పెట్టించి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విస్సన్నపేటలో జరుగుతున్న అక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌లకు వివరించామన్నారు. తక్షణమే అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని వారు కోరారు.

టిడ్కో గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలకు ఆందోళన

పరవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఇక్కడి టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న మహిళలు సోమవారం మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ గృహ సముదాయంలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలముకుంటోందన్నారు. నూతన పెన్షన్లు, కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయాల, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కె.ధర్మారావు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టి. సూరమ్మ, ఎస్. లక్ష్మి, గౌరి, ఎం.బంగారమ్మ, డి.లక్ష్మి, ఆర్.సీతా మహలక్ష్మి, ఆర్.ఇందుమతి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం చేయాలి

అనకాపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకున్న రైతులకు ప్లాట్‌లను వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఆర్.శంకరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి మండలం కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, వేటజంగాలపాలెం, సీతానగరం, మామిడిపాలెం, కొండుపాలెం, సంతపాలెం, కోడూరు రెవెన్యూ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుంచి భూములు సేకరించడం జరిగిందన్నారు. ఇదిజరిగి నాలుగేళ్లు పూర్తవుతున్నా రైతుల ప్లాట్‌లు రిజిస్ట్రేషన్ చేయకుండా ఉండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేసి, రాజధాని అమరావతి రైతుల వలే ప్రతి రైతు కుటుంబానికి ఏడాది కౌలు చెల్లించాలని కోరారు. అలాగే, ఇంతవరకు నష్టపోయిన పంటలకు వడ్డీతో సహా పరిహారం చెల్లించాలన్నా. ఈ ధర్నాలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, చలపతి, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుకు మోటార్ కార్మికుల ధర్నా

- ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నినాదాలు

అనకాపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సదరు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకంగా ఉన్న మోటార్ రంగ కార్మికుల సమస్యలపట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం తగదన్నారు. మోటార్ డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే డ్రైవర్లకు ఏ ప్రమాదం జరిగినా భరోసాగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు, అద్దె బస్సుల వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్‌పీ నాయుడు, పలకా సత్తిబాబు, శ్రీనివాసరావు, శంకరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సూరిశెట్టి బాబునాయుడు, కార్యదర్శి చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో టెన్త్ గణితం పరీక్షకు 20,682 మంది విద్యార్థులు హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం గణితం పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 107 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 20,677 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకాగా, ఐదు మంది ప్రైవేటు విద్యార్థులు విచ్చేశారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 20682 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు.

అనకాపల్లిలో జడ్సీ విస్తృత పర్యటన


నిదానందొడ్డిలో పర్యటిస్తున్న జడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ విస్తృతంగా పర్యటించారు. తెల్లవారుజాము నుంచి వీధుల్లో పారిశుధ్య కార్మికులు చెత్త ఏ విధంగా తొలగిస్తున్నారో పరిశీలించి పలు సూచనలు చేశారు. నిదానందొడ్డి, సంతోషిమాత ఆలయం రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, వేల్పులవీధి తదితర ప్రాంతాల్లో ఆయన పారిశుధ్య మెరుగు పనులను పరిశీలించారు. అలాగే అన్న క్యాంటీన్లు కూడా తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు వివరించారు. ఆయన వెంట శానిటేషన్ విభాగం అధికారులు ఉన్నారు.

‘అనకాపల్లి- చోడవరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి’

తుమ్మపాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి - చోడవరం రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కోరారు. సోమవారం సదరు రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి- చోడవరం రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు గోతుల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు ఈ రోడ్డు ప్రాధాన్యతను పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డపాటి చినరాజారావు, ఇంటి త్రినాథ్, కాండ్రేగుల రవి, రమణబాబు, ఒమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బవులువాడలో ‘జల్ జీవన్’ పనులు ప్రారంభం

తుమ్మపాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం బవులువాడ పంచాయతీ పరిధిలో సోమవారం జల్ జీవన్ మిషన్ పనులను గ్రామ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్ భూమి పూజ చేసి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని దర్జీనగర్, ఆర్‌వీఎస్‌నగర్, దేవాంగుల కాలనీలలో ప్రజలకు తాగు నీరు అందించేందుకు ఈ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మజ్జి వెంకట అప్పారావు, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్ఠికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సబ్బవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం కలిగి ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్. పైడితల్లి అన్నారు. ఇక్కడి సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీలకు సోమవారం రెండో విడత శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ దీపు కుటుంబానికి పరామర్శ

అనకాపల్లి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ దీపు కుటుంబాన్ని సోమవారం వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు. గవరపాలెం బోయగూడెంలోని ఆమె ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఏఎంసీ కాలనీలోని ట్రాన్స్‌జెండర్‌లను కలిసి మాట్లాడారు. ఆయన వెంట వైసీపీ నాయకులు కేఎం నాయుడు, వేగి త్రినాథ్ తదితరులు ఉన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష

- తండ్రి మరణించిన విషాదంలోనూ పరీక్ష రాసిన పదో తరగతి విద్యార్థి గౌరీశంకర్


తీవ్ర విషాదంతోనే పరీక్ష రాస్తున్న గౌరీశంకర్ (సర్కిల్)

దేవరాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ కాలనీకి చెందిన రొంగలి గౌరీశంకర్ పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. తన తండ్రి సింహాచలం మరణించారని తెలిసి కూడా, తీవ్ర విషాదంలో పరీక్ష రాశాడు. ఈ దృశ్యం అందరినీ కంట తడి పెట్టించింది. మోడల్ కాలనీకి చెందిన రొంగలి సింహాచలం (42) క్యాన్సర్ బారిన పడి ఇంటి దగ్గరే చికిత్స పొందుతున్నాడు. బుట్టలు అల్లుకొని జీవించే నిరుపేద కుటుంబానికి చెందిన అతనికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గౌరీశంకర్ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం రాత్రి సింహాచలం మృతి చెందారు. దీంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. తండ్రి మృత దేహం వద్దే రాత్రంతా గౌరీశంకర్ ఉన్నాడు. సోమవారం పరీక్షకు సమయం దగ్గర పడడంతో అంతిమ యాత్రలో పాల్గొనకుండానే నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న తెనుగుపూడి పరీక్షా కేంద్రానికి వెళ్లాడు. ఓ వైపు దుఃఖాన్ని దిగమింగుతూనే మరో వైపు భవిష్యత్తుకు ఉపయోగపడే పరీక్ష రాశాడు. వచ్చేసరికే దహన కార్యక్రమాలు పూర్తికావడంతో భోరున విలపించాడు.

ఐపీఎల్ సందడి



ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తూ క్రికెట్ అభిమానుల ఆనందోత్సాహాలు



ఢిల్లీ క్యాపిటల్స్ జెండాలతో యువతుల ఉత్సాహం

పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో అభిమానులు సోమవారం అసలైన ఐపీఎల్ మజాను ఆస్వాదించారు. ఢిల్లీ క్యాపిటల్స్- లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన హోరా హోరీ పోరులో పరుగుల వరద పారింది. సిక్సర్లు, ఫోర్ల వర్షం కురవడంతో కేరింతలు కొట్టారు. అభిమానుల కేరింతలు, చప్పట్లతో స్టేడియం దద్దరిల్లింది. ఉత్కంఠగా సాగిన పోరులో విజయం ఇరుజట్ల మధ్య ఊగిసలాడడంతో ప్రేక్షకులు ఊపిరిబిగబట్టి వీక్షించారు. ఆఖరి ఓవర్‌లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొనడంతో మునివేళ్లపై నిల్చున్నారు. చివరికి ఢిల్లీ జట్టు బ్యాట్స్‌మన్ సిక్సర్ బాదడంతో సంబరాలు అంబరాన్నంటాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



స్టేడియం బయట క్రికెట్ అభిమానుల సందడి





బౌలింగ్ చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు విప్రాజ్ నిగమ్, కులదీప్ యాదవ్



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ క్రీడాకారుడు మార్‌క్రమ్ బ్యాటింగ్ విన్యాసం



హాఫ్ సెంచరీ చేసిన ఆనందంలో మార్ష్



మిరుమిట్లు గొలిపిన బాణసంచా వెలుగులు



మ్యాచ్ గెలిపించిన అశుతోష్ విజయ దరహాసం



మ్యాచ్‌ను వీక్షిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, తదితరులు



ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ బ్యాటింగ్



మ్యాచ్‌ను తిలకించిన గవర్నర్ దంపతులు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ లీగ్‌లో భాగంగా సోమవారం పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ను తిలకించేందుకు విచ్చేసిన గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ దంపతులకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీష్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్ స్టేడియం ఆవరణలో స్వాగతించారు. పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేశారు. అనంతరం వీరంతా క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన గవర్నర్ దంపతులకు ఏసీఏ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు.



గవర్నర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్



మ్యాచ్ ప్రారంభానికి ముందు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పెందుర్తిలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

పెందుర్తి మార్చి 24 (ఆం ధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పెందుర్తి రైల్వేస్టేషన్ సమీ పంలో సోమవారం మధ్యా హ్నం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖ నుంచి బొగ్గులోడుతో పలాస వెళు తున్న గూడ్స్ రైలు పెందుర్తి రైల్వేస్టేషన్-సరిపల్లి బ్రిడ్జికి మధ్య పట్టాలు తప్పింది. దీంతో రైల్వే ట్రాక్ కాంక్రీట్ స్లీపర్లు ఒరిగి పట్టాలు కుంగిపోయాయి. సింగిల్ డౌన్ గూడ్స్ ట్రాక్ కావడంతో రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ముురుగు నుంచి విముక్తి

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం.. ఎలమంచిలిలో యానాద్రి కాలువ సమస్యను పరిష్కరించడంపై దృష్టి సారించింది. కాలువ ఆధునికీకరణ పనులకు వీఎంఆర్‌డీఏ రూ.2.73 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తికాగా, వారం క్రితం పనులు మొదలుపెట్టారు. దీనిపై వీఎంఆర్‌డీఏ డీఈ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. ప్రస్తుతం పూడిక తీత పనులు జరుగుతున్నాయని, ఇవి పూర్తయిన తరువాత రిటైనింగ్ వాల్, సీసీ లైనింగ్ వంటి పనులు చేపడతామని చెప్పారు. యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులు మొదలు కావడంతో పట్టణవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రేవు పోలవరం తీరంలో అనిత జన్మదిన వేడుకలు

- టీడీపీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసిన హోం మంత్రి
- సైకత శిల్పం వద్ద సెల్ఫీ
- శుభాకాంక్షల వెల్లువ



తీరంలో సైకత శిల్పం వద్ద మంత్రి అనిత సెల్ఫీ

ఎస్.రాయవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో అదే గ్రామానికి చెందిన వాసపల్లి అడవిరాజు ఇసుకతో మంత్రి అనిత రూపంతో కూడి సైకత శిల్పాన్ని ఏర్పాటు చేయించడంతో ఆదివారం అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో మంత్రి తన కుమారుడు, కుమార్తెతో కలిసి అక్కడికి చేరుకున్నారు. టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేశారు. అంతా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి అనిత సైకత శిల్పం వద్ద సెల్ఫీ తీసుకున్నారు. ఈ వేడుకల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, ఎస్.రాయవరం, నక్కపల్లి టీడీపీ మం డలాల అధ్యక్షులు అమలకంటి అబద్దం, కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ అధ్యక్షుడు ఎన్.వెంకటరాజు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అల్లూరిపై సినిమా

- దర్శకుడు కృష్ణవంశీ వెల్లడి
- రచయిత 'యండమూరి'తో కలిసి అల్లూరి స్మారక ప్రదేశాల సందర్శన



అల్లూరి సమాధుల వద్ద కృష్ణవంశీ, వీరేంద్రనాథ్ తదితరుల నివాళి

కృష్ణాదేవిపేట/, కొయ్యూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి చరిత్రకు సంబంధించిన మరిన్ని అంశాలతో సినిమా తీయాలనే ఆలోచన ఉన్నట్టు దర్శకుడు కృష్ణవంశీ తెలిపారు. ఆయన సోమవారం ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌తో కలిసి గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి స్మారక పార్కును సందర్శించారు. అల్లూరి, గంటందొరల సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రకు సంబంధించి పార్కులో ఉన్న శిలాఫలకాలను పరిశీలించారు. అక్కడ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బట్టపణుకుల పంచాయతీ లంకవీధి వెళ్లి అల్లూరి అనుచరులైన గాం గంటం దొర, మల్లుదొర వారసులను పరామర్శించారు. వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. గంటందొర జీవిత విషయాల గురించి ఆరా తీశారు. 'నేను సైతం' ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ కె.శివప్రసాద్ సమకూర్చిన చీరలు, దుప్పట్లను గంటందొర కుటుంబీకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవంశీ మాట్లాడుతూ అల్లూరిపై కొత్తపంథాలో సినిమా తీయాలనుకుంటున్నట్టు చెప్పారు. గంటందొర, మల్లుదొరలకు చెందిన జీవిత విశేషాలను, స్వాతంత్ర్యం సాధించడంతో వారి పాత్రను భావితరాలకు తెలిసేలా సినిమాకు రూపకల్పన చేస్తామన్నారు. అల్లూరి చరిత్రపై 20 సంవత్సరాలు పైబడి రీసెర్చ్ చేసిన గోకరాజు నారాయణరావు రచనను ఆధారంగా చేసుకుని సినిమా తీయాలనుకుంటున్నట్టు చెప్పారు. రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ అల్లూరి చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్మారక ప్రాంతాలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ టోకరా

... 5వ పేజీ తరువాయి

డ్రైవర్లకు డబ్బులు చెల్లించకుండా ఎగనామం పెట్టాడు. ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ వ్యవహారంతో కంగుతిన్న ఫ్యాక్టరీ యాజమాన్యం సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి కాటాల నుంచి చెరకు రవాణా చేసేందుకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ ఒకరు టెండర్ పాడుకున్నాడు. అయితే ఫ్యాక్టరీ అధికారులు కిరాయి డబ్బుల చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నారంటూ ఇటీవల కాటాల నుంచి చెరకును సక్రమంగా తీసుకు రావడలేదు. దీంతో కాటాల వద్ద చెరకు బండ్లు నిలిచిపోయి రైతులు ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ తనకు కిరాయి డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదీ తరువాత కాటాల నుంచి ఫ్యాక్టరీకి తెచ్చిన చెరకును అన్‌లోడింగ్ చేయకుండా ఐదురోజుల పాటు ఉంచేశాడు. దీంతో అధికారులు స్పందించి ఈ నెల 20న రూ.18 లక్షలు చెల్లించారు. మొత్తంమీద ప్రస్తుత సీజన్‌లో ఈ ఆపరేటర్‌కు రూ66 లక్షల వరకు రవాణా చార్జీలు చెల్లించారు. చివరి విడత రూ.18 లక్షలు తీసుకున్న తరువాత ఫ్యాక్టరీలో వున్న లారీల నుంచి చెరకు అన్‌లోడింగ్ చేసి, లారీలను తిరిగి కాటాలకు పంపకుండా ఆదివారం రాత్రి తీసుకెళ్లిపోయాడు. దీంతో అధికారులు కాటాల నుంచి చెరకును రప్పించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.

కూలీలకు, ట్రాక్టర్ డ్రైవర్లకు ఎగనామం

కాటాల వద్ద లారీల్లోకి చెరకు లోడింగ్ చేసిన కూలీలకు, కాటాల వద్దకు ట్రాక్టర్లతో చెరకు తెచ్చిన డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ డబ్బులు ఇవ్వలేదు. ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్‌కు ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించవలసింది సుమారు రూ.12 లక్షలు ఉంటే, కాటాల వద్ద కూలీలకు, ట్రాక్టర్ల డ్రైవర్లకు అతను రూ.30 లక్షల వరకు బకాయిలు ఉన్నట్టు సమాచారం. ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ వెళ్లిపోయాడన్న సమాచారం తెలుసుకుని కూలీలు ఫ్యాక్టరీకి వచ్చి ఎండీని కలిశారు. దీంతో ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ చేసిన మోసంపై ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగకార్తీక్ ఫ్యాక్టరీకి వచ్చి ఎండీ సన్యాసినాయుడుతోపాటు, కూలీల నుంచి వివరాలు సేకరించారు. ఆపరేటర్‌కు చెందిన రెండు లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు

గోవాడలో యువకుడి బైక్ విన్యాసాలు

- అదుపుతప్పి విద్యార్థినులపైకి దూసుకుపోయిన వాహనం
- ఉపాధ్యాయినితో పాటు ముగ్గురికి గాయాలు



కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

చోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవాడ జడ్పీ హైస్కూల్ వద్ద సోమవారం ఓ యువకుడు బైక్‌ను నిర్లక్ష్యంగా నడుపుతూ విన్యాసాలు చేశాడు. ఆ వాహనం అదుపుతప్పి విద్యార్థినులపైకి దూసుకు వెళ్లడంతో ఓ హిందీ ఉపాధ్యాయినితో పాటు ముగ్గురు విద్యార్థినులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. గోవాడ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థినులు స్కూల్ ముందు వేచి ఉన్నారు. ఇదే సమయంలో హైస్కూల్‌లో ఓ యువకుడు ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థుల ముందు విన్యాసాలు ప్రారంభించినట్టు చెపుతున్నారు. బైక్‌ను నిర్లక్ష్యంగా నడపడంతో అది అదుపుతప్పి పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థినులపైకి దూసుకుని వెళ్లింది. దీంతో నరసాపురం కస్తూర్బా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులతో పాటు, అదే స్కూల్‌కు చెందిన హిందీ ఉపాధ్యాయినికి గాయాలయ్యాయి. వెంటనే వీరు కమ్యూనిటీ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స తీసుకుని తిరిగి పరీక్షా కేంద్రానికి వెళ్లిపోయారు. కాగా, నిర్లక్ష్యంగా బైక్‌నడిపిన యువకుడు అక్కడి నుంచి పరారు కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు : ఎస్పీ సిన్హా

అనకాపల్లి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. క్రికెట్ బెట్టింగ్ యాప్స్ వలన త్వరగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. చట్ట విరుద్ధమైన ఈ బెట్టింగ్ యాప్స్ ప్రభావంతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేనది హెచ్చరించారు బెట్టింగ్‌ను ఎవరైనా నిర్వహిస్తే 100, 112 నంబర్లకు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

జిల్లా జూనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు రేపు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 26న సాలిగ్రామపురం హాకీ మైదానంలో నిర్వహిస్తామని హాకీ సంఘం కార్యదర్శి కె.వి.ఆంజనేయరావు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి ఒకటి, 2006న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు హాకీ మైదానంలో వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఏప్రిల్ 6 నుంచి ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీలో విశాఖ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 98851 99535 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404